# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 31-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:280 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

కాపాడగ యువత భవిత
దీపింపగ జేయగోరి దేశపు భవితన్
పేపరు లీకుల బిల్లును
శాపమ్ముల నడుమ లోకసభ పాస్ చేసెన్ !!

(దేశంలో యువకుల భవిష్యత్తు ను కాపాడేందుకు తద్వారా దేశ ప్రగతికి తోడ్పడేందుకు లోకసభ పేపరు లీకుల బిల్లును పాస్ చేసింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

సమాజం ఎటుచూసినా
సమస్యల వనం
స్పందించే గుణముంటే
సాహిత్యమే జనం.
అవనిపై నడక విడిచి
ఆకాశం కలలెందుకు
విస్మరిస్తే బాధ్యతను
వికసిస్తవా ముందుకు.



-వేల్పుల నారాయణ
9440433475

# టీచర్లే తెలంగాణ భవిష్యత్ శిల్పులు: సీఎం రేవంత్

## ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి..

హైదరాబాద్, జులై 30:ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా వ్యవస్థను అధ్యయనం చేసి వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుల బృందంతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాదేశ నిర్మాణంలో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని సీఎం గుర్తు చేశారు. విద్య సమాజంలో సమూల మార్పులకు పునాదిగా నిలుస్తుందని నెహ్రూ విశ్వసించారని, సాగునీటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించారని చెప్పారు. పంచవర్ష ప్రణాళికలు, హరిత విప్లవం వంటి సంస్కరణల ఫలితంగానే తెలంగాణ నేడు కోట్ల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు.



ప్రస్తుతం ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని, ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి సుమారు రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోందని తెలిపారు. అయినప్పటికీ ప్రైవేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రులు ఎందుకు మొగ్గుచూపుతున్నారో ఉపాధ్యాయులు ఆలోచించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో లక్ష మందికి పైగా అదనపు విద్యార్థులు చేరడం ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, ఉపాధ్యాయులకు కూడా భోజన సౌకర్యం కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించామని, ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మార్చామని, విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులను ఆ విశ్వవిద్యాలయం పాలక మండలిలోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు.

ఇంగ్లిష్ భాష మాత్రమే అభివృద్ధికి ప్రమాణం కాదని, చైనా వంటి దేశాలు తమ విద్యా విధానంతో ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో జర్మనీ, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పన్నెండో తరగతి పూర్తయ్యే నాటికి ప్రపంచంపై సమగ్ర అవగాహన కలిగేలా విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలు కేవలం ఉద్యోగుల సమస్యలకే పరిమితం కాకుండా విద్యార్థుల భవిష్యత్తుపైనా పోరాడాలని సీఎం సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి అమలు చేయాల్సిన సంస్కరణలపై డిసెంబరు నాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని కోరారు. ప్రతి మండలాన్ని ఒక విద్యా క్లస్టర్‌గా అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ప్రభుత్వ బాధ్యతేనని, విద్యార్థుల కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇకపై ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల మాదిరిగానే ప్రతి ఏడాది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి అక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేసే అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఇందుకు అవసరమైన ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు.రాజకీయాల కోసం కాకుండా, తెలంగాణలో నాణ్యమైన విద్యా వ్యవస్థ నిర్మాణం కోసం పనిచేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచే ప్రభుత్వ విద్యా వ్యవస్థను తెలంగాణలో నిర్మించేందుకు ఉపాధ్యాయులందరూ ఐదేళ్లపాటు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణలో భారీ వర్షాలు.. జిల్లాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్, జులై 30: తీవ్ర వాయుగుండం నేపథ్యంలో నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉమ్మడి నిజామాబాద్‌తోపాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.

ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తోపాటు హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# రెండు రోజులుగా వర్షాలు.. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జులై 30: తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు.

ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ బిల్లు.. ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



న్యూఢిల్లీ, జులై 30: లోక్‌సభలో బుధవారం ఆమోదం పొందిన యాంటీ పేపర్ లీక్ బిల్లును కేంద్రం రాజ్యసభ ముందుకు తీసుకొచ్చింది. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. లోక్‌సభలో ఆమోదం పొందిన మరుసటి రోజే రాజ్యసభకు ఈ బిల్లు రావడం విశేషం. విద్యార్థులు, యువత సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది అనేందుకు ఈ బిల్లే నిదర్శనం అని మంత్రి జితేంద్ర సింగ్ పునరుద్ఘాటించారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026 (యాంటీ పేపర్ లీక్ లా) పేరుతో ఈ బిల్లును కేంద్రం రూపొందించింది. ఈ బిల్లుపై లోక్‌సభలో రెండురోజులపాటు దాదాపు 10 గంటలకుపైగా చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ప్రతిపక్షాలు నిరసనలు, ఆందోళనలు చేసినప్పటికీ బిల్లు ఆమోదం పొందిందన్నారు. అలాంటి బిల్లును సీనియర్లు, మేధావులు ఉన్న పెద్దల సభకు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాల్ని ఉన్నతంగా కాపాడేందుకే, వారి సంక్షేమానికే తమ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు ఇదని జితేంద్ర సింగ్ అన్నారు. ఈ ప్రతిపాదిత బిల్లుపై చర్చించాలని ఆయన రాజ్యసభ సభ్యులను కోరారు. పేపర్ల లీకులను తమ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, వీటిని సహించేది లేదన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును ప్రమాదంలో పడేయబోమన్నారు. ఈ బిల్లును రూపొందించేందుకు ప్రధాని ఏమాత్రం ఆలస్యం చేయలేదని మంత్రి స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పారదర్శకత కోసమే ఈ బిల్లు తెచ్చామన్నారు. ప్రతిపక్షాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు. దేశంలో నాలుగు ప్రధానమైన నియామక, పరీక్షల నిర్వహణ సంస్థలు ఉన్నాయని వివరించారు. అవి యూపీఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, ఎన్‌టీయే అని చెప్పారు.

ఎన్‌టీయేను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కాంగ్రెస్ హయాంలో 1992లో వచ్చిందన్నారు. ఆ తర్వాత దీని ఏర్పాటును పలు కమిటీలు సమర్థించగా, చివరకు 2010లో ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ అంశంలో మిగిలిపోయిన పనుల్ని పూర్తి చేస్తున్నందుకు ప్రతిపక్షం తమను అభినందిస్తుందని భావిస్తున్నట్లు మంత్రి అన్నారు. ఈ సవరణ బిల్లు ప్రకారం పరీక్షా పత్రాల లీకేజీకి పాల్పడితే పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు.

# మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పు చేశారు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జులై 30: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. ఈరోజు (గురువారం) ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెలకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

# విద్యార్థులపై లాఠీఛార్జ్ చేస్తే.. అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారు? : ఖర్గే

న్యూఢిల్లీ, జులై 30: నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. గురువారం రాజ్యసభలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ..



ఇంతటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకు అమిత్ షా ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లాడాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా.. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి ఖర్గే స్పష్టం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేయాలి? అని మోదీ సర్కారును ఆయన నిలదీశారు. పేపర్ లీక్ అనేది తలదించుకోవాల్సిన అంశమని ఖర్గే అభివర్ణించారు. 2024లోనే ఈ బిల్లు ఎందుకు తీసుకురాలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు తప్ప విద్యార్థులపై ప్రేమ లేదని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. బిహార్‌లో ఆందోళనకు దిగిన విద్యార్థులపై తుపాకులు ఎక్కుబెట్టారని విమర్శించారు. ఆందోళన చేసిన యువత ఉగ్రవాదులు కాదు కదా? అని కేంద్రానికి ఖర్గే చురకలంటించారు.

# తెలంగాణ రైతులకు యూరియాను సకాలంలో అందించాలి ..

## పార్లమెంట్‌లో ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి

న్యూ ఢిల్లీ, జులై 30: ఖరీఫ్ సీజన్ లో తెలంగాణ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో ఎరువులు,యూరియా ను అందించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వా న్ని కోరారు.

క్లిష్ట సమయంలో పంట ఎదుగుదల, వ్యవసాయ ఉత్పాదకతను కాపాడటా నికి ఎలాంటి అంతరాయం లేని ఎరువులను అందించడం అత్యవసరమని అన్నారు.

రాజ్యసభ జీరో అవర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో తీవ్రమైన యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఎరువుల కోసం గంటల తరబడి పొడవైన లైన్లలో నిలబడాల్సి వచ్చిందని, అనేక చోట్ల ఖాళీ చేతులతో తిరిగి వెళ్లాల్సి వచ్చిందని వివరించారు.

లైన్లలో నిలబడి వేచి ఉన్న సమయంలో రైతులు స్పృహతప్పి పడిపోయిన, తోపులాటలో ప్రాణాలు కూడా కోల్పోయిన విషాదకర సంఘటనలు చోటు చేసుకున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు.

ఇటువంటి బాధాకరమైన పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గతేడాది ఎదురైన అనుభవం, ప్రణాళిక, సమన్వయం, ఎరువుల సకాలంలో పంపిణీలో ఉన్న తీవ్రమైన లోపాలను బయటపెట్టిందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు.

రైతు సంఘాలు, ప్రజాప్రతినిధుల నుంచి పదేపదే హెచ్చరికలు చేసినా తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణకు అదనపు పరిమాణంలో యూరియాను వెంటనే విడుదల చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే కోరడం జరిగిందని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

# సమ్మక్క సారక్క దర్శనానికి వచ్చి వెళ్ళే భక్తుల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగద్దు



ములుగు, జులై 30:(నేటినిజం ప్రతినిధి) ప్రతినిధి ములుగు జిల్లా ములుగు జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తుతున్న వర్షాల వల్ల తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో పలు విధుల్లో రోడ్లపై వర్షపు నీరు చేరి సమ్మక్క సారక్క దర్శనానికి వచ్చి వెళ్ళే భక్తుల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి సీతక్క గారి ఆదేశాల మేరకు ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేగ కల్యాణి గారు స్థానికంగా ఉండే జేసీబీ సాయంతో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రోడ్లపై చేరిన వరద నీటిని తొలగించారు..



రానున్న రోజుల్లో వర్షాలు ఎక్కువ పడే అవకాశం ఉన్నందున మేడారం సమ్మక్క సారక్క దర్శనానికి వచ్చే భక్తులు వాతావరణాన్ని గమనించి ం ా ఎ ా ల ని సూచించారు.

వారి వెంట తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బొల్లు దేవేందర్, ఇర్ప సునిల్ దొర,మేడారం సర్పంచ్ పిరిల భారతి వెంకన్న,సీనియర్ నాయకులు పులి సంపత్ సీనియర్ నాయ కులు తదిత రులు పాల్గొన్నారు.




# అవకాడో ఫ్రూట్‌లో పోషక విలువలు సూపర్

## (31 జూలై "జాతీయ అవకాడో దినం" సందర్భంగా)

అవకాడో అనే ఆధునిక అమృత ఆహారం నేడు అద్భుత పోషక విలువలతో "సూపర్ ఫ్రూట్"గా ప్రసిద్ధిగాంచింది. అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో విస్తారంగా వినియోగిస్తున్న అవకాడో పండ్లు నేడు భారతదేశంలోకి అడుగిడి అందరికీ అమృత ఆహారంగా మన మెనూలో చేరింది. అవకాడో అనేది కూరగాయల వర్గానికి చెందినది కాదని, అది ఒక పండు అని తెలుసుకోవాలి. అవకాడో పండ్లను సలాడ్, టోస్ట్, స్మూథీస్, స్ప్రెడ్, రుచికరమైన పండుగా పలు రూపాల్లో ఉపయోగించడానికి అలవాటు పడుతున్నాం. ఇటీవల విశేష ఆదరణ పొందిన ఈ అద్భుత పండ్ల పోషక విలువలను ప్రజలకు తెలియజేయడానికి ప్రతి ఏట 31 జూలై రోజున "జాతీయ అవకాడో దినం" పాటించుట 2018 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది.

**అవకాడో ఫ్రూట్ పోషక విలువలు:**

ఆరోగ్యకరమైన, రుచికరమైన అవకాడో పండ్లలో అత్యంత ముఖ్యమైన పోషక విలువలు ఉంటాయి. అర్టి పండ్లలో కన్న అవకాడో పండ్లలో అధిక పొటాషియం ఉంటుంది. చెట్టు నుంచి తెంపిన తర్వాతనే అవకాడో పండుతుంది.

ఆకలి పెంచడానికి మంచి అపటైజర్‌గా పని చేస్తుంది. 2015లో అమెరికా దేశంలోనే దాదాపు 4.25 బిలియన్ల అవకాడో పండ్ల అమ్మకాలు జరిగాయి.

గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించే అవకాడోలో మంచి కొవ్వులు పుష్కలంగా ఉంటాయి.

ఇన్సులిన్ నిరోధకతను సరి చేయగల అవకాడోలో విటమిన్ సి, ఈ, కె లాంటివి సమృద్ధిగా ఉంటాయి.

అల్జీమర్స్ వ్యాధి కట్టడికి అవసరమైన ఒమెగా 3 ఫాటీ ఆమ్లాలు అవకాడోలో ఉంటాయి. అవకాడో ఉన్న ఓలిక్ ఆసిడ్ వల్ల చర్మం తేమతో ఎర్రబారకుండా, ఇర్రిటేషన్ కలిగించకుండా చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది.

జాతీయ అవకాడో దినం వేదికగా ఈ సూపర్ ఫ్రూట్ పోషక విలువలను అవగాహన పరచడం, పలు కొత్త రకాల అవకాడో రెసిపీలు, అవకాడో వంటల పోటీలు, మన భోజనంలో అవకాడోను నిత్యం చేర్చడం, అవకాడో ప్రేమికుల అభిప్రాయాలను తెలుసుకోవడం లాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టవచ్చు.



-మధుపాళీ
9949700037

# ఎస్ఏఎఫ్, కోర్సియా అమలుకు భారత్ సంసిద్ధతను సమీక్షించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూ ఢిల్లీ, జులై 30:సుస్థిర విమాన ఇంధనం (ఎస్ఏఎఫ్), అంతర్జాతీయ విమానాయానంలో కర్బనోద్గార పరిహార నిబంధనల అమలు - ఉద్గారాల తగ్గింపు పథకం (కోర్సియా), అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏవో)కు చెందిన అంతర్జాతీయ కర్బనోద్గారాల తగ్గింపు విధానం అమలు దిశగా భారత్ సన్నద్ధతను సమీక్షించేందుకు.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఈ రోజు ఉన్నతస్థాయి భాగస్వామ్య పక్షాల సమావేశాన్ని నిర్వహించింది.

పౌర విమానయాన కార్యదర్శి, పౌర విమానయాన మంత్రిత్వశాఖ, పెట్రోలియం - సహజ వాయు మంత్రిత్వశాఖ, పర్యావరణ- అటవీ- వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ, పౌర విమానయాన డైరెక్టొరేట్ జనరల్ (డీజీసీఏ), భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ), భారత ప్రమాణాల బ్యూరో (బీఐఎస్), ఎనర్జీ ఎఫిషియెన్సీ బ్యూరో (బీఈఈ), చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు), విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వాహక సంస్థలు, ఇతర భాగస్వామ్య పక్షాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఎస్ఏఎఫ్ ఉత్పత్తి, ధ్రువీకరణ, సరఫరా వ్యవస్థ అభివృద్ధిలో పురోగతిని ఈ సమావేశంలో సమీక్షించారు. చమురు మార్కెటింగ్ కంపెనీలు అమలు చేస్తున్న వివిధ ఎస్ఏఎఫ్ ఉత్పత్తి ప్రాజెక్టుల స్థితిగతులు, ఈ కేంద్రాలను ప్రారంభించడానికి నిర్దేశించిన కాలపరిమితులను కూడా సమీక్షించారు. 2027 నుంచి ఎదురయ్యే డిమాండును అందిపుచ్చుకునేలా.. సుస్థిర విమానయాన ఇంధనాన్ని సకాలంలో అందుబాటులో ఉండేలా చూసేందుకు అవసరమైన చర్యలపై సంబంధిత వర్గాలు చర్చించాయి.

ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. "మన విమానయాన రంగ అభివృద్ధికి తోడ్పడుతూ, అంతర్జాతీయ అకర్బనీకరణ ప్రయత్నాలకు అర్థవంతంగా దోహదపడే ఒక పటిష్టమైన, ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల సుస్థిర విమానయాన ఇంధన పర్యావరణ వ్యవస్థను నిర్మించేందుకు భారత్ కట్టుబడి ఉంది. 'ఒకే భూమి- ఒకే కుటుంబం- ఒకే భవిత' అన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక మార్గనిర్దేశంలో.. ఎస్ఏఎఫ్‌ను కేవలం నిబంధనల అమలుగా మాత్రమే కాకుండా, ఒక వ్యూహాత్మక జాతీయ అవకాశంగా వేం భావిస్తున్నాం. ఎస్ఏఎఫ్‌కు సంబంధించి ప్రతీ దశలో రైతులతోపాటు వివిధ భాగస్వామ్య పక్షాలన్నీ ప్రయోజనాన్ని పొందుతాయి" అన్నారు.

"ఉద్గారాలను తగ్గించడానికి ఒక పరిశ్రమగా మేమిప్పటికే అనేక కోణాల్లో కృషి చేస్తున్నాం. దేశంలో పూర్తిగా హరిత ఇంధనాన్ని వినియోగించే విమానాశ్రయాల సంఖ్య 2014లో 'సున్నా'గా ఉండగా.. నేడు వాటి సంఖ్య 104కు చేరింది. వాటిలో పూర్తిగా 100 శాతం హరిత ఇంధనాన్ని వినియోగిస్తున్నారు. లీజింగ్ వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా.. ఆధునిక, ఇంధన సామర్థ్యం కలిగిన విమానాలను సమకూర్చుకునేలా విమానయాన సంస్థలకు సహకారాన్ని అందిస్తున్నాం. మన సమష్టి ప్రయత్నాలకు ఎస్ఏఎఫ్ కూడా ఒక కీలకమైన అంశం. సాధ్యాసాధ్యాల అధ్యయనాల నుంచి నిర్దిష్ట కాలవ్యవధులతో కూడిన ఉత్పత్తి కాలక్రమాల దిశగా, ఆశయాల నుంచి ఆచరణ దిశగా మనమిప్పుడు అడుగులు వేయాలి. తగినంత ఉత్పత్తి, లెక్కల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అత్యంత తక్కువ వ్యయంతో కూడిన పద్ధతిలో 1 శాతం కోర్సియా మిశ్రమ ఆవశ్యకతను సాధించడమే మన తక్షణ ప్రాధాన్యం. మన దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా.. ఏకోన్ముఖ ప్రభుత్వ విధానం ద్వారా కార్బన్ క్రెడిట్ పరిహార యంత్రాంగాన్ని తప్పక అభివృద్ధి చేయాలి" అని మంత్రి పేర్కొన్నారు.

ఎస్ఏఎఫ్ తప్పనిసరి మిశ్రణ ప్రతిపాదనతోపాటు అందులో చమురు మార్కెటింగ్ కంపెనీలు, విమానయాన సంస్థలు, విమానాశ్రయ ఆపరేటర్ల పాత్రపై శ్రీ రామ్మోహన్ నాయుడు సమీక్షించారు. ఐసీఏవో/ కోర్సియా అవసరాలకు అనుగుణంగా పటిష్టమైన గణన, పర్యవేక్షణ, నివేదన యంత్రాంగం ఏర్పాటుపైనా, సంపూర్ణ అనుసంధానం కలిగిన జాతీయ ఎస్ఏఎఫ్ రిజిస్ట్రీ అభివృద్ధి, ధ్రువీకరణ - మార్కెట్ ప్రవేశాన్ని సులభతరం చేసే చర్యలపైనా చర్చించారు.

సమన్వయంతో కూడిన అమలు ప్రాధాన్యాన్ని వివరిస్తూ మంత్రి ఇలా అన్నారు: "సమష్టి నిర్ణయాలు, సంబంధిత భాగస్వామ్య పక్షాల నడుమ సమన్వయంతో ఈ పరివర్తన ప్రక్రియ ముందుకు సాగాలి. ఎస్ఏఎఫ్ సరఫరా వ్యవస్థల అభివృద్ధి, జాతీయ ఎస్ఏఎఫ్ రిజిస్ట్రీ, అకౌంటింగ్ - నివేదన వ్యవస్థలు, కోర్సియాను సమర్థంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యల్లో పురోగతిపై వేం సమీక్షించాం. ఇప్పటికే సాధించిన గణనీయమైన పురోగతి, సంబంధిత మంత్రిత్వ శాఖలు, పరిశ్రమ వర్గాల నిబద్ధత ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నాయి. 2027 జనవరి 1న కోర్సియా తప్పనిసరి దశ ప్రారంభం కావడానికి ముందే భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేలా.. ఇందులో గుర్తించిన కార్యాచరణ అంశాలను వేగవంతం చేయాలని సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నింటినీ స్పష్టంగా నిర్దేశించాం.

ఎస్ఏఎఫ్ విధానం, దాని ఆర్థిక ప్రభావంపై మాట్లాడుతూ... "ఎస్ఏఎఫ్ విధాన ముసాయిదా ఇప్పుడు తుది దశలో ఉంది. వివిధ స్థాయిల్లో ఇలాంటి వివిధ అంతరమంత్రిత్వ శాఖల సంప్రదింపులు, భాగస్వామ్య పక్షాలతో సమావేశాలను నిర్వహిస్తున్నాం. నా వరకూ.. ప్రయాణికుడి అభిప్రాయమే అత్యంత కీలకం. ప్రయాణికుడే మన పరిశ్రమలో అత్యంత ముఖ్యమైన భాగస్వామి. ఈ ప్రక్రియతో ప్రయాణికులు, విమానయాన సంస్థలపై సాధ్యమైనంత తక్కువ భారమే ఉండేలా మనం చూడాలి. అందుకోసం సాధ్యమయ్యే అన్ని ఎస్ఏఎఫ్ మార్గాలనూ మనం అధ్యయనం చేయాలి. ఉత్పత్తి దశ నుంచి విమానాశ్రయంలో చేరవేసే వరకు అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన విధానాన్ని ఆ మార్గాల్లో గుర్తించాలి" అని శ్రీ రామ్మోహన్ నాయుడు వివరించారు.

అధికార పత్రాల జారీ, భారత్‌లో కోర్సియా-అనుకూల కర్బన మార్కెట్ విధాన రూపకల్పన సహా.. కోర్సియా అమలు దిశగా భారత్ సన్నద్ధతపైనా సమావేశంలో చర్చించారు.

దేశీయంగా సుస్థిర విమాన ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, భారత విమానయాన వ్యవస్థను బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ విమాన యానంలో కర్బనోద్గారాలను తగ్గించడానికి, సుస్థిర విమాన యాన రంగంలో భారత్‌ను అంతర్జాతీయంగా అగ్రగామిగా నిలపడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది.

# కడెం ప్రాజెక్టు వరద పరిస్థితులపై అధికారుల సమీక్ష



ఆదిలాబాద్, జులై 30:జిల్లాలో మొన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు నీటిమట్టం, ఇన్‌ఫ్లో, వరద ప్రవాహం, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.ప్రాజెక్టు వద్ద చేపట్టిన భద్రతా చర్యలను పరిశీలించిన అధికారులు, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో డీఆర్‌డీఓ వీడీ విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కడెం మండల తహసీల్దార్, ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈ, కడెం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలకు దారేది.. వార్తతో కదిలిన అధికార యంత్రాంగం

## -విద్యార్థుల భద్రతపై ప్రత్యేక ఆదేశాలు



ఆదిలాబాద్, జులై 30:నిన్న ఆంధ్రప్రభ వెబ్‌లో ప్రచురితమైన "పాఠశాలకు దారేది.." కథనం ప్రభావంతో అధికార యంత్రాంగం స్పందించింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.

ఈ సందర్భంగా వరద ఉధృతికి తెగిపోయిన రెంకొని వాగు తాత్కాలిక వంతెనను పరిశీలించిన ఎస్పీ, సంబంధిత అధికారులతో పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.

వాగుకు అవతల ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ (టీఎంఆర్ఈఐఎస్) విద్యార్థుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఎస్పీ సూచించారు. అలాగే వరద ప్రవాహం ఉన్న వాగులు, చెరువుల్లోకి వెళ్లడం, ఈత కొట్టడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఖానాపూర్ సీఐ కటకం సత్యనారాయణ, ఎస్ఐ రాహుల్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, న్యాయవాది షబ్బీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# 'మచిలీపట్నం' యుద్ధనౌక జల ప్రవేశం

## ఎంఏహెచ్ఈ-శ్రేణి జలాంతర్గామి నిరోధక యుద్ధనౌకల్లో ఇది ఏడోది

న్యూఢిల్లీ, జులై 30:భారత నౌకాదళం కోసం కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మిస్తున్న ఎనిమిది జలాంతర్గామి నిరోధక యుద్ధ నౌకల్లో ఏడోదైన మచిలీపట్నం (బీవై 529) యుద్ధ నౌక ఈ రోజు జల ప్రవేశం చేసింది. సైనిక వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్, శ్రీమతి గూల్రుఖ్ ఆనంద్‌లు ఈ నౌకను ప్రారంభించి, జల ప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమానికి భారత నావికాదళం, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లకు చెందిన ఉన్నతాధికారులు, ఇతర విశిష్ట అతిథులు హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో గల చరిత్రాత్మక ఓడరేవు పట్టణమైన మచిలీపట్నం పేరును ఈ నౌకకు పెట్టారు. ఈ పట్టణం గొప్ప సముద్ర వారసత్వానికి, భారత తూర్పు తీరప్రాంతంలో వర్ధిల్లుతున్న వాణిజ్యానికి ప్రసిద్ధి చెందింది. మచిలీపట్నం చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ నౌక మచిలీపట్నం స్ఫూర్తిని, వారసత్వాన్ని సగర్వంగా ప్రతిబింబిస్తూ... దేశ నౌకా వాణిజ్య ప్రయోజనాలను పరిరక్షించడం పట్ల భారత నౌకాదళ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుంది.

ఈ నౌక నీటి అడుగున నిఘా, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధం (ఏఎస్‌డబ్ల్యూ), అల్ప తీవ్రత గల నౌకా వాణిజ్య కార్యకలాపాలు (ఎల్ఐఎమ్‌వో) సహా మైన్ వార్‌ఫేర్ సామర్థ్యంతో సన్నద్ధమైంది. ఈ నౌక తీరప్రాంత రక్షణను మరింత బలోపేతం చేయడంతో పాటు, నౌకా వాణిజ్య రంగం పట్ల అవగాహనను మెరుగుపరుస్తుంది.

మచిలీపట్నం నౌక ప్రారంభం... ఏఎస్‌డబ్ల్యూ ఎస్‌డబ్ల్యూసీ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేయడంలో మరో కీలక మైలురాయిని సూచిస్తుంది. రక్షణ రంగ తయారీలో స్వయం-సమృద్ధ భారత్ సాధన పట్ల భారత నిబద్ధతను ఇది పునరుద్ఘాటిస్తుంది. 80 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఈ ప్రాజెక్టు మెరుగవుతున్న భారత నౌకా నిర్మాణ పరిశ్రమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుంది.

# మత్స్యకారుల బీమా 'జీఏఐఎస్' కింద 2026-27 నుంచే ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జులై 30: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మత్స్యరంగం అభివృద్ధి కోసం 2020-21 నుంచి ఇప్పటిదాకా మత్స్య-పశుసంవర్ధక- పాడిపరిశ్రమ మంత్రిత్వశాఖ పరిధిలోని మత్స్యశాఖ ద్వారా రూ.20,750 కోట్లతో 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' (పీఎంఎంఎస్‌వై)ను అమలు చేస్తోంది.

ఈ పథకం కింద మత్స్యకారులతోపాటు ఆ రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత కూడా లభిస్తుంది.

తదనుగుణంగా సముద్ర-అంతర్గత జలాల్లో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు సహా అనుబంధ రంగ కార్మికులకు సామూహిక ప్రమాద బీమా పథకం (జీఏఐఎస్) ద్వారా సామాజిక భద్రత సదుపాయం లభిస్తుంది.

ఈ బీమా రక్షణ కోసం చెల్లించాల్సిన రుసుము భారాన్ని (హిమాలయ, ఈశాన్య రాష్ట్రాలకు 90:10) కేంద్ర-రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. కేంద్రపాలిత ప్రాంతాలకు మాత్రం మొత్తం రుసుమును కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.

పీఎంఎంఎస్‌వై కింద బీమా రక్షణ: మరణం లేదా శాశ్వత సంపూర్ణ వైకల్యానికి రూ.5,00,000, శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2,50,000, (తితితి) ప్రమాదం సంభవించి ఆసుపత్రిలో చేరినపుడు ఖర్చుల కోసం రూ.25,000 వంతున బాధితులకు ఆర్థిక సహాయం లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్ గడచిన ఐదేళ్లలో 'జీఏఐఎస్' భాగస్వామ్యం స్వీకరించని నేపథ్యంలో ప్రస్తుత (2026-27) ఆర్థిక సంవత్సరం 2,84,888 మంది మత్స్యకారులకు ఈ పథకం కింద బీమా రక్షణ కోసం ప్రతిపాదన పంపింది. దీనికింద అభ్యర్థనల దాఖలు- పరిష్కార ప్రక్రియలు సంబంధిత పాలసీ నిబంధనలు-షరతులకు లోబడి ఉంటాయి. ఈ ప్రక్రియల సరళీకరణతోపాటు ప్రామాణిక అభ్యర్థన విధివిధానాలు, ఆవశ్యక పత్రాలు వంటి వాటిని ఇప్పటికే ప్రకటించారు. దీనికి అనుగుణంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కాల వ్యవధి సమాచారం కూడా వెళ్లింది.

లోపాల సవరణ, అభ్యర్థనల సమర్పణను వేగిరపరచి, అర్హత గల అభ్యర్థనల సత్వర పరిష్కారం దిశగా రాష్ట్ర మత్స్యశాఖలు, బీమా కంపెనీలు, మధ్యవర్తిత్వ సంస్థలతో క్రమం తప్పకుండా సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# భూటాన్‌కు అస్సాం ఐస్ క్రీమ్- పూరబీ ఎగుమతి కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మ

న్యూఢిల్లీ, జులై 30:అస్సాం పాడి రంగంతో పాటు ఈశాన్య ప్రాంతానికి చెందిన శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం. 5,267 లీటర్ల పూరబీ ఐస్ క్రీముతో కూడిన ఒకటో అంతర్జాతీయ కన్‌సైన్‌మెంటును అస్సామ్ నుంచి భూటానుకు ఎగుమతి చేశారు. దీంతో ఈ ప్రాంతం నుంచి విలువను జోడించిన పాడి సంబంధిత ఎగుమతులకు నూతన అవకాశాలు అందుబాటులోకి వచ్చినట్లయింది.

ఎగుమతి సరకు రవాణాను అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మ నిన్న, అంటే 2026 జులై 28న ప్రారంభించారు. నార్త్ ఈస్ట్ డెయిరీ, ఫూడ్స్ (ఎన్ఈడీఎఫ్ఎల్) ఎగుమతి చేసిన ఈ సరకును భూటాన్‌లోని థింపూ, పారో, ఫుయెన్షోలింగ్‌తో పాటు వాంగ్‌దూ వంటి కీలక మార్కెట్లకు సరఫరా చేస్తారు. ఫలితంగా అస్సాం, ఈశాన్య ప్రాంత పాడి ఉత్పాదనలకు ఇరుగుపొరుగు అంతర్జాతీయ మార్కెట్లలో ఆదరణ పెరుగుతుందని భావిస్తున్నారు.

పూరబీ ఐస్ క్రీమును వెస్ట్ అస్సాం మిల్క్ ప్రొడ్యూసర్స్ కోఆపరేటివ్ యూనియన్ (డబ్ల్యూఏఎమ్‌యుఎల్) తయారు చేసింది. ఈ ఐస్ క్రీమును నార్త్ ఈస్ట్ డెయిరీ, ఫూడ్స్ (ఎన్ఈడీఎఫ్ఎల్) విక్రయిస్తోంది. అస్సాం అంతటా విస్తరించిన సహకార సంఘాల నెట్‌వర్క్ అందించే పాలను ఉపయోగించి, పూరబీ ఐస్ క్రీమును తయారు చేస్తున్నారు. తొలి విడత కన్‌సైన్‌మెంటులో కప్పులు, కోన్లు, కుటుంబానికి సరిపోయే ప్యాకులు, గ్యాలన్ ప్యాకులు సహా వివిధ ఉత్పాదనలు ఉన్నాయి. వీటిని భూటాన్లో వినియోగదారులతో పాటు సంస్థలను దృష్టిలో పెట్టుకొని తయారు చేశారు.

కేంద్ర ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల శాఖ అధీనంలోని అగ్రికల్చరల్, ప్రాసెస్డ్ ఫూడ్ ప్రాడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ.. 'అపెడా') ఈశాన్య ప్రాంతం నుంచి వ్యావసాయిక ఉత్పాదనలతో పాటు శుద్ధి చేసిన ఆహారోత్పాదనలను ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడంలోనూ, విదేశీ మార్కెట్లకు సులభంగా చేరుకోవడంలోనూ ఎగుమతిదారు సంస్థలకు సహాయపడుతోంది 'అపెడా'. ఈ ప్రాంతంలో విలువను జోడించిన ఉత్పాదనలను ప్రోత్సహించడమే కాక ఆ ఉత్పాదనలు మరిన్ని అంతర్జాతీయ మార్కెట్లకు చేరుకొనేలా చూడడంలో కూడా అపెడా చేస్తున్న నిరంతర కృషిని తాజా ఎగుమతి చాటిచెబుతోంది.

ఈశాన్య ప్రాంతం నుంచి శుద్ధి చేసిన పాడి ఉత్పాదనల ఎగుమతికి సంబంధించిన విస్తారిత అనుబంధ వ్యవస్థను అపెడా పటిష్ఠపరిచింది. ఎగుమతులతో ముడిపడిన దస్తావేజులకు సంబంధించిన పనులు, నియంత్రణ సంబంధిత నియమాల పాలన, సరకు మార్కెట్లకు చేరుకొనేటట్లుగా చూడటం, ఆసక్తిదారులతో సమన్వయాన్ని ఏర్పరచడం వంటి పనుల్లో అపెడా తోడ్పడి, కన్‌సైన్‌మెంటుకు మార్గాన్ని సుగమం చేసింది. దీంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండానే సరకును భూటాన్ వరకూ చేర్చారు.భారత్, భూటాన్ భౌగోళికంగా పక్క పక్క దేశాలు అయినందువల్ల అస్సాం నుంచి పాడి ఉత్పాదనల ఎగుమతిని ప్రోత్సహించడానికి నైసర్గిక ప్రయోజనం కూడా లభిస్తోంది. అస్సాంలో తయారు చేసిన పాడి ఉత్పాదనలు పొరుగున గల అంతర్జాతీయ మార్కెట్లలో విరివిగా లభ్యమయ్యేటట్లు చూడటానికి భూటాన్ ఒక ముఖ్య ప్రవేశద్వారంగా ఉపయోగపడుతుంది. రాబోయే కాలంలో, దీర్ఘకాలం మన్నిక కలిగిన అదనపు పూరబీ పాడి ఉత్పాదనలను ప్రవేశపెట్టి మార్కెట్టు గిరాకీకి అనుగుణంగా ఎగుమతిని మెల్లమెల్లగా పెంచుతూ ఎగుమతుల శ్రేణిని విస్తరించేందుకు ఎన్ఈడీఎఫ్ఎల్ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.

ఈ కార్యక్రమంతో ఈశాన్య ప్రాంత పాడి ఉత్పాదనలకు అంతర్జాతీయ ఆదరణ విస్తరించడం, పాడి పరిశ్రమకు దీర్ఘకాలిక ఎగుమతి అవకాశాలు అందడమే కాకుండా అస్సాం సహకార రంగ పాడి నెట్‌వర్క్‌తో ముడిపడిన వేలాది పాడి రైతులకు ఆదాయావకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.

భారత వ్యావసాయిక ఉత్పాదనలు, శుద్ధి చేసిన ఆహారోత్పాదనలు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడటాన్ని ప్రోత్సహించడంతో పాటు దేశవ్యాప్తంగా రైతులకూ, వ్యవసాయ ప్రధాన వాణిజ్య సంస్థలకూ మన్నికైన ఎగుమతి ఆధారిత అభివృద్ధి అవకాశాలను అందించడానికి రాష్ట్రప్రభుత్వాలతో, ఎగుమతి సంస్థలతో, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ల (ఎఫ్‌పీఓల)తో, సహకార సంఘాలతో, ఇతర ఆసక్తిదారులతో అపెడా కలిసి పనిచేస్తోంది.

# ఎడతెరిపి లేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం

కరీంనగర్, జులై 30: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో గొల్లపల్లి మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పంట పొలాలు నీటమునగగా, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

మండలంలో అత్యధికంగా 82.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలుచోట్ల రహదారులపైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

మండలంలోని బొంకూరు, రాపల్లె గ్రామాల్లో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. స్థానిక అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

వర్షాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అవసరమైతే తప్ప వాగులు, వంకలు దాటవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

# ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నేతృత్వంలో సంరక్షణ కేంద్రాల్లో గత 12 ఏళ్లలో పులుల సంఖ్య గణనీయమైన పెరుగుదల: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, జులై 30:న్యూఢిల్లీలో జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (ఎన్టీసీఏ) నిర్వహించిన ప్రపంచ పులుల దినోత్సవం–2026 కార్యక్రమాన్ని ఉద్దేశించి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ఈ రోజు ప్రసంగించారు. ప్రకృతితో సామాజిక అనుబంధాన్నీ మరింత పెంపొందించుకోవాలనీ, పర్యావరణ పరిరక్షణ ఆధారిత జీవనశైలిని అలవర్చుకోవాలనీ ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్, సీనియర్ ప్రభుత్వాధికారులు, వన్యప్రాణి నిపుణులు, క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది, విద్యార్థులు, ఇతర ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమం.. పులుల సంరక్షణలో భారత్ విజయాలను చాటింది. పులులనూ, వాటి ఆవాసాలనూ పరిరక్షించే దిశగా సమష్టి నిబద్ధతను పునరుద్ఘాటించింది.

సంరక్షణ అంటే వన్యప్రాణులను రక్షించడం మాత్రమే కాదనీ, ప్రకృతితో గౌరవప్రదమైన అనుబంధాన్ని పెంపొందించుకోవడమనీ శ్రీ యాదవ్ స్పష్టం చేశారు. “ప్రకృతి అంటే కేవలం పర్యాటకమో, వినోదమో మాత్రమే కాదు.. ప్రకృతిని గౌరవించాలి. ప్రజలు దాని నుంచి ప్రశాంతతను పొందాలి” అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ప్రకృతి నుంచి స్ఫూర్తిని పొంది, పర్యావరణ పరిరక్షణకు పునరంకితమయ్యేలా జీవనశైలిని అలవరచుకోవాలని ఆయన కోరారు.

పులుల సంరక్షణపరంగా భారత్ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో పులుల సంఖ్య (3,682), పులుల సంరక్షణ కేంద్రాల సంఖ్య (58) గణనీయంగా పెరిగాయని మంత్రి తెలిపారు. గత 12 ఏళ్లలో ఏనుగుల అభయారణ్యాలు, జాతీయ పార్కులు, వన్యప్రాణి అభయారణ్యాలు, రక్షిత ప్రాంతాలు, కమ్యూనిటీ రిజర్వులు, చిత్తడి నేలల సంఖ్య కూడా పెరిగిందని వివరించారు.

ఎన్టీసీఏ పర్యావరణ హిత పర్యాటక (ఎకో టూరిజం) వెబ్‌పేజీని ప్రారంభిస్తూ.. అన్ని పులుల సంరక్షణ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపైకి తెచ్చిన ఎన్టీసీఏను శ్రీ యాదవ్ అభినందించారు. సఫారీ, వసతి సదుపాయానికి బుకింగుల కోసం అన్ని పులుల సంరక్షణ కేంద్రాల ప్రామాణిక వెబ్‌సైట్ల లింకులు ఇందులో అందుబాటులో ఉంటాయి. తద్వారా సమాచారం సులభంగా అందుబాటులోకి రావడమే కాకుండా.. బాధ్యతాయుతమైన, సుస్థిరమైన ప్రకృతి హిత పర్యాటకాన్ని ఇది ప్రోత్సహిస్తుంది.

అటవీ సంరక్షణ అనుభవాలను గ్రంథస్తం చేయాల్సిన ఆవశ్యకతపై మంత్రి మాట్లాడుతూ.. “అడవుల కథలు కేవలం సమాచారం మాత్రమే కాదు.. సంప్రదాయ విజ్ఞానం, భావోద్వేగాలు, వన్యప్రాణి సంరక్షణ పట్ల ఆకాంక్ష అందులో కనిపిస్తాయి. అటవీ/వన్యప్రాణి అధికారులు, సంరక్షకుల అనుభవాలెన్నో వాటిలో ఉంటాయి” అని మంత్రి అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ గురించి అటవీ అధికారులు మరింతగా రాయాలనీ, ఆచరణాత్మకమైన, అమలు చేయదగిన విధాన నిర్ణయాలకు దోహదపడే విధంగా తమ అనుభవాలను పంచుకోవాలని ఆయన కోరారు.

ప్రపంచవ్యాప్తంగా ఆచరిస్తున్న అత్యుత్తమ విధానాలను అవలంబించడం ద్వారా అటవీ అధికారులు, సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను కూడా శ్రీ యాదవ్ ప్రస్తావించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచవ్యాప్తంగా విజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునే విషయంలో అంతర్జాతీయ బిగ్ క్యాట్ కూటమి (ఐబీసీఏ) కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

పులుల సంరక్షణ కోసం క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న వారి సేవలను గుర్తిస్తూ.. పులుల సంరక్షణ, రక్షిత ప్రాంతాల నిర్వహణలో విశేష కృషి చేసిన అటవీ/వన్యప్రాణి అధికారులకు, ఇతర సహాయకులకు ఎన్టీసీఏ పురస్కారాలను అందించారు. వన్యప్రాణి సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది కృషిని గుర్తించడానికి కూడా ఈ కార్యక్రమం ఒక వేదికను అందించింది.

‘పులులను కాపాడుదాం’ అన్న ఇతివృత్తంపై ఢిల్లీలోని బడి పిల్లలకు నిర్వహించిన పెయింటింగ్, స్కెచింగ్, నినాదాల రచన, మాస్కు తయారీ పోటీల్లో నుంచి ఎంపిక చేసిన అత్యుత్తమ కృతులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి వీక్షించారు. అలాగే, పులుల సంరక్షణ కేంద్రాల సమీపంలోని పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ.. మంత్రిత్వ శాఖ పర్యావరణ విద్యా కార్యక్రమం కింద, ఎకో క్లబ్‌ల ద్వారా దేశవ్యాప్తంగా పులుల సంరక్షణపై అవగాహన ప్రచారాన్ని కూడా చేపట్టారు.

శాస్త్రీయత ప్రాతిపదికగా పులుల సంరక్షణ, విజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, ప్రజల్లో అవగాహనను పెంపొందించడంలో ఎన్టీసీఏ నిరంతర అంకితభావాన్ని ప్రతిబింబించేలా.. అయిదు ప్రచురణలను కూడా ఈ కార్యక్రమంలో భాగంగా విడుదల చేశారు. వీటిలో ఎన్టీసీఏ ప్రజాప్రచార పత్రిక ‘స్ట్రైప్స్’ 2026 జులై సంచిక, 24 పులుల సంరక్షణ కేంద్రాల భద్రతా ఆడిట్ నివేదిక, దేశంలోని పులుల ఆవాస ప్రాంతాల్లో ఎలుగుబంట్ల ఆవాస అనుకూలత అంచనాపై నివేదిక, ఐబీసీఏ, జీటీఎఫ్ ప్రచురించిన ‘టైగర్స్ ఆఫ్ ది వరల్డ్’, శ్రీ చంద్ర ప్రకాష్ గోయల్, శ్రీ సత్య ప్రకాష్ యాదవ్ రచించిన ‘ది రెహ్మన్ ఖేరా టైగర్’ ఉన్నాయి.

ప్రతిభను గుర్తించడం, శాస్త్రీయ నిర్వహణ, సామర్థ్యాభివృద్ధి, బాధ్యతాయుతమైన పర్యావరణ హిత పర్యాటకం, విజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, సుసంపన్నమైన దేశ సహజ వారసత్వాన్ని పరిరక్షించడంలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా.. పులుల సంరక్షణకు భారత్ ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని ప్రపంచ పులుల దినోత్సవం–2026 కార్యక్రమాలు స్పష్టం చేశాయి.

ఒక వందేళ్ల కిందట ఆసియాలో లక్ష పులులుండేవని అంచనా. చారిత్రకంగా వాటికి ఆవాస ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతంలో నేడు పులుల సంఖ్య అందులో 8 శాతం కన్నా తక్కువకు పడిపోయింది. అంతేకాదు.. బాలి, జావాన్, కాస్పియన్ అనే మూడు పులుల ఉప జాతులు అంతరించిపోయాయి. వేట, వన్యప్రాణుల అక్రమ రవాణా, ఆవాసాల నష్టం, విచ్ఛిన్నం, మానవ – వన్యప్రాణి ఘర్షణ, వాతావరణ మార్పులు పులుల సంఖ్య తగ్గడానికి కారణమయ్యాయి.

పులుల సంరక్షణ దిశగా సమష్టి కృషి ఆవశ్యకతను గుర్తించి.. 13 పులుల ఆవాస దేశాల నాయకులు 2010లో సెయింట్ పీటర్స్‌బర్గ్ టైగర్ సదస్సులో ఒక్కచోట చేరి ప్రపంచ పులుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని (జీటీఆర్పీ) ప్రారంభించారు. 2022 నాటికి ప్రపంచవ్యాప్తంగా పులుల సంఖ్యను రెట్టింపు చేయాలన్న ప్రతిష్ఠాత్మక టీ2 లక్ష్యంతో.. ఏటా జులై 29న ‘ప్రపంచ పులుల దినోత్సవా’న్ని నిర్వహించాలని కూడా ఈ సదస్సులో నిర్ణయించారు.

నాటి నుంచి పులుల సంరక్షణ, అంతర్జాతీయ సహకార బలోపేతం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై అవగాహనను పెంపొందించడంతోపాటు.. పులులూ, వాటి ఆవాసాలను కాపాడడంలో పురోగతిని సమీక్షించేందుకు ప్రపంచ పులుల దినోత్సవం ఒక వేదికను అందిస్తోంది.

# సహకార ప్రణాళికలు, ఆవిష్కరణ సవాళ్లు, సామర్థ్య పెంపు ద్వారా ఏఐ ఆధారిత పాలన, ప్రజారోగ్య- ప్రజా సేవలను అందిస్తున్న ‘ఇండియా ఏఐ మిషన్’

న్యూఢిల్లీ, జులై 30:సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచన ఆధారంగా భారతదేశ ఏఐ విధానం తయారైంది. ఏఐ వల్ల కలిగే ప్రమాదాలు, సవాళ్లను ఎదుర్కొంటూనే యువతకు ఆర్థిక అవకాశాలను, ఉపాధిని కల్పించడం దీని ముఖ్య లక్ష్యం.

ఏడాదికి 300 బిలియన్ డాలర్ల రాబడి, 60 లక్షల మంది ఉద్యోగులతో అత్యంత క్రియాశీలకంగా ఉన్న దేశీయ ఐటీ రంగాన్ని ప్రాతిపదికగా తీసుకుని భారతదేశ ఏఐ వ్యూహం తయారైంది. ఇండియా ఏఐ మిషన్ కింద పేర్కొన్న ఏడు ప్రధాన విభాగాల ద్వారా భారత ఏఐ లక్ష్యాలకు మద్దతునిస్తుంది:

ఇండియా ఏఐ కంప్యూట్ విభాగం: వేగంగా విస్తరిస్తున్న భారత ఏఐ అంకురాలు, పరిశోధక వర్గాల అవసరాలను తీర్చడానికి అత్యంత సామర్థ్యం కలిగిన, సులభంగా విస్తరించదగిన ఏఐ కంప్యూటింగ్ వ్యవస్థను నెలకొల్పడం.

ఫౌండేషన్ మోడల్స్: మన దేశ సార్వభౌమ ఏఐ సామర్థ్యాలను పెంపొందించడానికి, భారత్‌కు మాత్రమే ప్రత్యేకమైన వినియోగ నమూనాల అవసరాలను తీర్చడానికి స్వదేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎంలు), మల్టీమోడల్ మోడల్స్, రంగాల వారీ స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్‌ను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించడం.

ఇండియా ఏఐ అప్లికేషన్ డెవలప్‌మెంట్ కార్యక్రమం – ఐఏడీఐ: కీలక రంగాలకు పెద్ద పీట వేస్తూ భారీ సామాజిక–ఆర్థిక మార్పును తీసుకురాగల సామర్థ్యం ఉన్న ప్రభావవంతమైన ఏఐ పరిష్కారాల అభివృద్ధి, విస్తరణ, వినియోగానికి మద్దతు ఇవ్వడం.

ఇండియా ఏఐ ఫ్యూచర్‌స్కిల్స్: ఏఐ విద్యను అందరికీ సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ప్రత్యేక డేటా, ఏఐ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం.. విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందించడం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను రూపకల్పన చేయడం ద్వారా నైపుణ్యం కలిగిన ఏఐ మానవ వనరుల వ్యవస్థను నిర్మించడం.

ఏఐ కోష్– ఇండియా ఏఐ డేటాసెట్స్ వేదిక: స్వేచ్ఛా ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల నుంచి లభించే సమాచార వనరులను ఒకే చోటకు చేర్చి నాణ్యమైన డేటాసెట్‌లు, మోడల్‌లు, టూల్స్‌ను సులభంగా పొందగలిగేలా ఒకే ఒక సమగ్ర వేదికను రూపొందించడం.

సురక్షితమైన, విశ్వసనీయ ఏఐ: భారతదేశపు విలక్షణమైన సామాజిక–ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యానికి అనుగుణంగా తయారుచేసిన స్వదేశీ పాలనా చట్రాలు, ఎవాల్యుయేషన్ సాధనాల ద్వారా బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి బాటలు వేయడం.

ఇండియా ఏఐ స్టార్టప్ ఫైనాన్సింగ్: ప్రాజెక్ట్ ప్రారంభంలోని రూపకల్పన స్థాయి నుంచి వాణిజ్యీకరణ వరకు నిధుల కొరతను నివారిస్తూ మొదటి నుంచి వృద్ధి దశ వరకు అవసరమైన మూలధనం, పూర్తి స్థాయి సహాయాన్ని అందించడం.

అప్లికేషన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (ఐఏడీఐ) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులను ఒకే చోటకు చేర్చి ప్రజారోగ్య, ప్రజా సేవల విషయంలో ఏఐ వినియోగంపై 2024 ఏప్రిల్ 5న ‘ఇండియా ఏఐ’ ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించింది.

ఈ వర్క్‌షాప్ మంత్రిత్వ శాఖలు, విభాగాలు తమ డేటా సామర్థ్యాలను అంచనా వేయడంలో ఏఐ ఉపయోగించే సందర్భాలను (యూజ్ కేసులు) గుర్తించడంలో సహాయపడింది. పరిపాలన, ప్రజా సేవలను అందించే విషయంలో ఏఐ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడంలో సంప్రదింపులు, భాగస్వామ్య దృక్పథాన్ని ఇది పెంపొందించింది.

ఆవిష్కరణ సవాళ్లు, నిధులు అందించే కార్యక్రమాలు, హ్యాకథాన్‌ల ద్వారా ఐఏడీఐ ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పాలన, వాతావరణం, సైబర్ భద్రత, ఆర్థిక నియంత్రణతో సహా అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగాల్లో అనేక ఏఐ పరిష్కారాల నమూనాలను రూపొందించింది. ఆలోచనల దశ నుంచి ప్రయోగాత్మక వినియోగం, విస్తరణ వరకు వీటిని తీసుకెళ్లే మార్గాలను సుగమం చేసింది. దీని కింద ఇండియా ఏఐ మిషన్ ఈ రంగాల వ్యాప్తంగా 11 జాతీయ స్థాయి హ్యాకథాన్‌లు, ఆవిష్కరణ ఛాలెంజ్‌లను ప్రారంభించింది.

ఇండియా ఏఐ ఆవిష్కరణ ఛాలెంజ్.. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పాలన, అభ్యాస వైకల్యాలు, వాతావరణ మార్పుల రంగాలలో ఏఐ పరిష్కారాలపై దృష్టి సారించింది. కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, ప్రభుత్వ రంగ సంస్థలతో ప్రయోగాత్మక వినియోగం కోసం మొదటి దశలో 30 పరిష్కారాలను ఎంపిక చేశారు. ఆ తర్వాత జాతీయ స్థాయి విస్తరణ కోసం ఐదు బృందాలను (ప్రతి రంగానికి ఒకటి) ఎంపిక చేశారు. ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టులు వివిధ స్థాయిలలో పురోగమిస్తున్నాయి.

ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) భాగస్వామ్యంతో నిర్వహించిన ‘ఇండియా ఏఐ ఐ4సీ సైబర్ గార్డ్ ఏఐ హ్యాకథాన్’.. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో (ఎన్సీఆర్పీ) వస్తున్న సైబర్ నేర ఫిర్యాదులను వర్గీకరించడానికి, కొత్తగా ఉత్పన్నమవుతున్న నేరాల సరళిని గుర్తించడానికి ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేసింది. ఇలా జాబితా చేసిన పరిష్కారాన్ని ఐ4సీ వ్యవస్థలతో అనుసంధానించారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) భాగస్వామ్యంతో నిర్వహించిన ‘ఇండియా ఏఐ – జీఎస్ఐ మినరల్ టార్గెటింగ్ విత్ ఏఐ హ్యాకథాన్’... భూగర్భశాస్త్రం, భూభౌతికశాస్త్రం, భూరసాయనశాస్త్రం, రిమోట్ సెన్సింగ్ వంటి భూ శాస్త్రీయ డేటాసెట్‌లను ఉపయోగించి అధునాతన ఖనిజ నిక్షేపాలను అంచనా వేసేందుకు ఏఐ, ఎంఎల్‌ను ఉపయోగించడంపై దృష్టి పెట్టింది.

జాతీయ క్యాన్సర్ గ్రిడ్ భాగస్వామ్యంతో చేపట్టిన ‘క్యాన్సర్ ఏఐ, సాంకేతిక ఛాలెంజ్’ (క్యాచ్).. క్యాన్సర్ పరీక్ష, వ్యాధి నిర్ధారణ, చికిత్సా విషయంలో సహాయం, ఆరోగ్య సంరక్షణ నిర్వహణను బలోపేతం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఎంపిక చేసిన ఉత్తమ బృందాల పరిష్కారాలను అమలు చేయడానికి ముందు వాటికి సంబంధించిన నైతిక పరిశీలన జరుగుతోంది.

‘ఇండియా ఏఐ ఫేస్ అథెంటికేషన్ ఛాలెంజ్’.. ఏఐ ఆధారంగా నకిలీలను తొలగించడం, ‘వన్–టు–మెనీ’ ఫోటో పరిశీలన ద్వారా ప్రభుత్వ పరీక్షల పారదర్శకత, ప్రామాణికతను పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. యూపీఎస్సీలో (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) వినియోగించేందుకు రెండు బృందాలను ఎంపిక చేశారు. ఇప్పటికే దీని అమలు ప్రారంభమైంది.

‘ఇండియా– ఏఐ ఇంటెలిజెంట్ డాక్యుమెంట్ ప్రాసెసింగ్ (ఐడీపీ) ఛాలెంజ్’.. క్లిష్టమైన బహుభాషా పత్రాల నుంచి సమాచారాన్ని ఆటోమేటిక్‌గా వేరు చేయడం, వర్గీకరించడం, ప్రామాణీకరించడం, క్రమబద్ధీకరించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఎంపిక చేసిన రెండు బృందాలను యూపీఎస్సీలో నియమించారు. ప్రస్తుతం వీటి అమలు కొనసాగుతోంది.

ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖల మద్దతుతో ప్రారంభమైన ‘ఇండియా ఏఐ ఆవిష్కరణ ఛాలెంజ్ 2026’.. ఆయుష్ ఆరోగ్య సంరక్షణ, ఎంఎస్ఎంఈల (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల) కోసం ఏఐ పరిష్కారాలను ప్రోత్సహిస్తుంది. విభిన్న సమస్యల పరిష్కారాల కోసం ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయి. మొదటి దశ ఎవాల్యుయేషన్లు పురోగతిలో ఉన్నాయి. దీని తర్వాత నమూనా (ప్రాటోటైప్) అభివృద్ధి, ప్రయోగాత్మక వినియోగం చేపట్టనున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) భాగస్వామ్యంతో నిర్వహించిన ‘పరిపాలనలో భారీ మార్పుల కోసం ఇండియా ఏఐ ఛాలెంజ్’.. కీలక శాఖల్లో ఏఐ ఉపయోగించే సందర్భాలపై (యూజ్ కేసులు) దృష్టి సారించింది. దీనికి సంబంధించిన దరఖాస్తులు అందాయి. ప్రస్తుతం మొదటి దశ ఎవాల్యుయేషన్లు జరుగుతున్నాయి. తదుపరి దశలో నమూనాల అభివృద్ధి, ప్రయోగాత్మక అమలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఇండియా ఏఐ ఫైనాన్షియల్ కాంప్లయన్స్ రిపోర్టింగ్ ఛాలెంజ్.. నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్ఎఫ్ఆర్ఏ) భాగస్వామ్యంతో ఏఐ ఆధారిత నిబంధనల అమలు పర్యవేక్షణ, ప్రమాద ముప్పు అంచనాను ప్రోత్సహిస్తుంది.

సీడీఎస్సీఓ.. ఇండియా ఏఐ హెల్త్ ఇన్నోవేషన్ యాక్సిలరేషన్ హ్యాకథాన్: సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్‌తో (సీడీఎస్సీఓ) కలిసి నిర్వహించిన ఈ హ్యాకథాన్... పత్రాల సారాంశాల తయారీ, వివరాల గోప్యత, తనిఖీ నివేదికలతో సహా నిబంధనల అమలు ప్రక్రియలను ఏఐ ద్వారా ఆటోమేట్ చేయడంపై దృష్టి పెట్టింది. దీనికి సంబంధించి నమూనాల అభివృద్ధి, విస్తరణలు ప్రణాళికాబద్ధంగా ఉన్నాయి.

పీఎంజేఏవైపై ఆటో అడ్జ్యుడికేషన్ హ్యాకథాన్: నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) భాగస్వామ్యంతో పీఎంజేఏవైపై క్లెయిమ్‌ల పరిశీలన కోసం ఏఐ ఆధారిత పరిష్కారాల చట్రాలను అభివృద్ధి చేయడానికి మద్దతునిచ్చింది. దీని ఫలితంగా అనేక నమూనాలు, ప్రయోగాత్మక వినియోగాలు సాధ్యమయ్యాయి.

ఈ కార్యక్రమాలన్నీ కలిసి పరిపాలన, ప్రజా సేవలను అందించే విషయంలో ఏఐ కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన, అమలు ప్రక్రియలలో వర్క్‌షాప్‌లు, సంప్రదింపులు, భాగస్వామ్య సవాళ్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలను చురుగ్గా సంప్రదిస్తూ భాగస్వాములను చేస్తున్న తీరును తెలిజేస్తున్నాయి.

ఏఐ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు: సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు, పరిశ్రమ భాగస్వాముల సహకారంతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 58 ఏఐ ఎక్సలెన్స్ సెంటర్ల (ఏఐ–సీఓఈ) ఏర్పాటు పథకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ఆమోదించిన నిబంధనల ప్రకారం తమిళనాడు రాష్ట్రానికి రెండు ఏఐ ఎక్సలెన్స్ సెంటర్లను (ఏఐ–సీఓఈ) కేటాయించారు.

ఇండియా ఏఐ డేటా, ఏఐ ల్యాబ్‌లు (ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు): ఇండియా ఏఐ ఫ్యూచర్ స్కిల్స్ విభాగం కింద ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని ఐటీఐలు, పాలిటెక్నిక్‌లలో ఏఐ, డేటా అనోటేషన్, డేటా క్యూరేషన్, అప్లైడ్ డేటా సైన్స్‌లలో శిక్షణ ఇవ్వడం కోసం 543 డేటా, ఏఐ ల్యాబ్‌ల ఏర్పాటు చేసేందుకు ఆమోదం లభించింది.

ఈ ప్రతిపాదనలో భాగంగా తమిళనాడుకు 18 డేటా, ఏఐ ల్యాబ్‌లను కేటాయించారు.

ఇండియా ఏఐ ఫెలోషిప్‌లు: ఇండియా ఏఐ ఫ్యూచర్‌స్కిల్స్ విభాగం కింద ఏఐ విద్య, పరిశోధనల కోసం డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందుతున్నాయి. దేశవ్యాప్తంగా 178 సంస్థలకు చెందిన విద్యార్థులకు మొత్తం 686 ఫెలోషిప్‌లను మంజూరు చేశారు. వీటిలో 96 డిగ్రీ, 34 పీజీ, 32 పీహెచ్‌డీ ఫెలోషిప్‌లతో కలిపి తమిళనాడుకు చెందిన విద్యార్థులకు అత్యధికంగా 162 ఫెలోషిప్‌లు లభించాయి.

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు: భారత్ 2026 ఫిబ్రవరి 16 నుంచి 21 వరకు ఢిల్లీలో ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు–2026’ను నిర్వహించింది. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో గౌరవ ప్రధాని మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల వ్యాప్తంగా ఏఐ వినియోగాన్ని వేగవంతం చేసేందుకు ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో’తో చురుగ్గా భాగస్వామ్యమై తమ తమ రంగాలకు సంబంధించిన ఏఐ అనువర్తనాలను గుర్తించాలని కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలను కోరారు.

ఈ సూచనలతో పాటు సదస్సులో జరిగిన చర్చల ఆధారంగా పరిపాలన, సేవలను అందించటం, పనితీరు సామర్థ్యం, రంగాల వారీ సవాళ్లను పరిష్కరించడంలో ఏఐని ఉపయోగించుకునే అవకాశాలను గుర్తించేందుకు క్యాబినెట్ కార్యాలయం.. వివిధ మంత్రిత్వ శాఖలు, శాఖలతో సమన్వయం చేసింది. దీని ఫలితంగా 62 మంత్రిత్వ శాఖలు, విభాగాల నుంచి 762 సమస్యలను (ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్) గుర్తించారు. ఏఐ ఆధారిత పరిష్కారాలను సులభతరం చేయడం కోసం వీటిని తదనంతరం ‘ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ’కు (మైటీ) పంపించారు.

పౌర సేవలతో సహా ప్రభుత్వ వ్యవస్థలలో ఏఐ వినియోగం.. పారదర్శకత, జవాబుదారీతనం, సమాచార గోప్యత, ఆల్గారిథమిక్ నిష్పాక్షికత, స్వతంత్ర తనిఖీ ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా చూడటానికి ప్రభుత్వం కింది చర్యలను చేపట్టింది:

డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం– 2023 (డీపీడీపీ చట్టం).. ప్రయోజనాల పరిమితి, డేటా తగ్గింపు, సమాచార సహిత అంగీకారం, యాక్సెస్– సవరణ, డేటా నిబంధనల తొలగింపు హక్కులతో సహా వ్యక్తిగత డేటాను ప్రాసెస్ చేయడానికి ఒక సమగ్రమైన చట్రాన్ని అందిస్తుంది. దీని ప్రకారం ‘ప్రధాన డేటా సంరక్షకులు’.. ఒక డేటా ఆడిటర్‌ను నియమించి క్రమానుగతంగా ‘డేటా సంరక్షణ ప్రభావ అసెస్‌మెంట్స్ నిర్వహించడాన్ని ఇది తప్పనిసరి చేస్తుంది.

ఇండియా ఏఐ మిషన్‌లో ‘సురక్షితమైన, విశ్వసనీయ ఏఐ’ విభాగం కింద.. ఏఐ పక్షపాత నిర్మూలన, అల్గారిథమ్ ఆడిటింగ్, వివరించదగిన ఏఐ, గోప్యతను పరిరక్షించే ఏఐ, డీప్‌ఫేక్ గుర్తింపు వంటి అంశాలపై 13 బాధ్యతాయుతమైన ఏఐ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. మోడల్ నిష్పాక్షికతను అంచనా వేసే సాధనాలు, భాగస్వామ్య అల్గారిథమిక్ ఆడిటింగ్ కోసం ఓపెన్ సోర్స్ చట్రంతో సహా స్వదేశీ సాధనాలు, నిబంధనలను అభివృద్ధి చేయడానికి విద్యాసంస్థలు, అంకురాలు, పరిశ్రమలు, పౌర సమాజ సంస్థలు వీటిని అమలు చేస్తున్నాయి.

దేశంలో కృత్రిమ మేధ సురక్షితమైన, బాధ్యతాయుతమైన, సమగ్రమైన అభివృద్ధి, వినియోగం కోసం ఒక సమగ్ర జాతీయ చట్రాన్ని అందిస్తూ 2025 నవంబర్ 5న ‘ఇండియా ఏఐ గవర్నెన్స్ మార్గదర్శకాలు’ విడుదల అయ్యాయి. వీటికి అనుగుణంగా ఈ సంస్థాగత వ్యవస్థలు ప్రారంభమయ్యాయి: ఏఐ గవర్నెన్స్ అండ్ ఎకనామిక్ గ్రూప్ (ఏఐజీఈజీ).. భారతదేశ జాతీయ ఏఐ పరిపాలనా వ్యూహాన్ని రూపొందించడానికి వివిధ మంత్రిత్వ శాఖలతో ఏర్పడిన ఒక ఉన్నత స్థాయి సంస్థ. టెక్నాలజీ అండ్ పాలసీ ఎక్స్‌పర్ట్ కమిటీ (టీపీఈసీ).. సాంకేతిక, విధానపరమైన సిఫార్సులను అందించే నిపుణుల కమిటీ. ఏఐఎస్ఐ (ఏఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్).. భద్రతా పరిశోధనలు చేపట్టడం, ప్రమాణాలను రూపొందించడం, ఏఐ వ్యవస్థలను పరీక్షించడం, ఉత్పన్నమయ్యే నూతన ముప్పులను ఎవాల్యుయేషన్ చేయడం కోసం ఏర్పాటు చేసిన సంస్థ.

# భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు ముమ్మరం చేయాలి

## ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశం



కరీంనగర్, జులై 30: (నేటినిజం ప్రతినిధి) జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.

తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా మూసుకుపోకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటి ముంపు సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తాగునీటి బృందాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరిశోధనాత్మక విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవాలి: మనోజ్ సిన్హా

ఖమ్మం, జులై 30: పరిశోధనాత్మక విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. ఖమ్మం నగరంలోని వెలుగుమట్లలో ఉన్న కాన్‌రాయ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన విద్యా, ఆధ్యాత్మిక ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా మనోజ్ సిన్హా మాట్లాడుతూ బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలికి, అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి అంశాన్ని పరిశోధనాత్మక దృక్పథంతో అధ్యయనం చేసి చదువుల్లో రాణించాలని, సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు చూపే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో సర్వతోముఖ అభివృద్ధి సాధించాలని, లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాఠశాల, తల్లిదండ్రులు, గురువులు, స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

స్కూల్ చైర్మన్ నామా తరుణ్ చిన్న వయస్సులోనే తన నాయనమ్మ నామా వరమ్మ పేరు మీద లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థను నిర్వహించడం అభినందనీయమని మనోజ్ సిన్హా కొనియాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# నీట్ యూజీ కౌన్సెలింగ్-2026 కోసం సన్నద్ధతను సమీక్షించిన కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా

న్యూఢిల్లీ, జులై 30:నీట్ యూజీ కౌన్సెలింగ్-2026 సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా ఈ రోజు సమీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల ప్రవేశ ప్రక్రియను పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా, సాంకేతికతతో అనుసంధానించి... ప్రక్రియ అంతా విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా చూడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) ఆధ్వర్యంలోని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) పరిధిలో గల ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ), ఇతర సీట్ల కౌన్సెలింగ్ కోసం సన్నద్ధతను ఈ సమీక్ష అంచనా వేసింది.

మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ, ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ సహా కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనే ఇతర భాగస్వాముల సంసిద్ధతను సమీక్ష సందర్భంగా కేంద్ర మంత్రి అంచనా వేశారు. కౌన్సెలింగ్ షెడ్యూల్, ఐటీ మౌలిక సదుపాయాలు, సైబర్ సెక్యూరిటీ సంసిద్ధత, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలు, అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించే చర్యలు, పాల్గొంటున్న సంస్థలతో సమన్వయాన్ని కేంద్ర మంత్రి సమీక్షించారు.

విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా కౌన్సెలింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రతిభ ఆధారంగా నిర్వహించాలని శ్రీ నడ్డా స్పష్టం చేశారు. ప్రవేశ ప్రక్రియ అంతటా పటిష్ఠమైన సాంకేతిక మద్దతును కొనసాగించాలని, ఫిర్యాదుల సత్వర పరిష్కారాన్ని నిర్ధారించాలని, కౌన్సెలింగ్ పోర్టల్ సజావుగా పనిచేసేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల ఆందోళనలను పరిష్కరించడానికి అవసరమైన ముందస్తు చర్యలన్నీ చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పారదర్శకతను పెంచడం, మరింత మెరుగ్గా అందుబాటులో ఉంచడం, ప్రవేశ ప్రక్రియను సులభతరం చేయడం లక్ష్యంగా నీట్ యూజీ కౌన్సెలింగ్-2026లో అనేక ప్రధాన సాంకేతిక ఆధారిత, విద్యార్థి-కేంద్రిత సంస్కరణలు ప్రవేశపెడుతున్నట్లు అధికారులు కేంద్ర మంత్రికి తెలిపారు.

ఈ కీలక సంస్కరణల్లో ఒకటి... ఒకేసారి భౌతికంగా రిపోర్ట్ చేసే విధానాన్ని ప్రవేశపెట్టడం. దీనివల్ల అభ్యర్థులు పదేపదే సంస్థలను సందర్శించాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. సీట్ల కేటాయింపు తర్వాత, అభ్యర్థులు ఫ్రీజ్ లేదా ఫ్లోట్ ఆప్షన్‌ను ఎంచుకోవడం ద్వారా ఆన్‌లైన్‌లో తమ సుముఖతను వ్యక్తపరచవచ్చు.

ఫ్రీజ్ ఆప్షన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు... అసలు ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ రుసుము చెల్లింపు సహా ప్రవేశ సంబంధిత లాంఛనాలను పూర్తి చేయడం కోసం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం తమకు కేటాయించిన సంస్థకు స్వయంగా హాజరు కావాలి.

అప్‌గ్రేడేషన్ కోసం తదుపరి రౌండ్‌లలో పాల్గొనడానికి ఫ్లోట్ ఆప్షన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు... నిర్దేశించిన కాలపరిమితిలోగా ధ్రువపత్రాల పరిశీలన సహా ప్రవేశ సంబంధిత లాంఛనాలను ఆన్‌లైన్ విధానం ద్వారా పూర్తి చేసుకోవచ్చు. ఈ కాలంలో, వారు కేటాయించిన సంస్థకు భౌతికంగా హాజరు కావడం, అసలు ధ్రువపత్రాలను సమర్పించడం లేదా ప్రవేశ రుసుము చెల్లించడం వంటివి చేయాల్సిన అవసరం లేదు. తదుపరి కౌన్సెలింగ్ రౌండ్‌లలో పాల్గొనేటప్పుడు వారి తాత్కాలిక ప్రవేశం చెల్లుబాటులో ఉంటుంది.

మూడో రౌండ్ కౌన్సెలింగ్ వరకు అప్‌గ్రేడేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. మూడో రౌండ్ పూర్తయిన తర్వాత, సీట్లు పొందిన అభ్యర్థులు అసలు ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ రుసుము చెల్లింపు, సంస్థాగత లాంఛనాలను పూర్తి చేయడం కోసం వారు సీటు పొందిన సంస్థలకు స్వయంగా హాజరు కావాలి.

ఒకేసారి భౌతికంగా హాజరు కావడం, అసలు ధ్రువపత్రాలను ఒకేసారి పరిశీలించడం, ప్రవేశ రుసుమును ఒకేసారి చెల్లించడం వంటి వాటిని ఈ సవరించిన విధానం నిర్ధారిస్తుంది. తద్వారా అనవసర ప్రయాణాలను తగ్గించి, ప్రవేశ ప్రక్రియలను సులభతరం చేసి, విద్యార్థులకు మరింత సౌకర్యాన్ని అందిస్తుంది.

ఈ సంవత్సరం ప్రవేశపెట్టిన మరో ముఖ్యమైన సంస్కరణ ఆన్‌లైన్ రాజీనామా సౌకర్యం. వర్తించే కౌన్సెలింగ్ నియమాలు, కాలపరిమితుల ప్రకారం అనుమతించిన చోట... ఇన్ఫర్మేషన్ బులెటిన్‌లో వేరే విధంగా పేర్కొనకపోతే లేదా ఎంసీసీ ద్వారా ప్రత్యేకంగా నోటిఫై చేయకపోతే... తమకు కేటాయించిన సీటుకు రాజీనామా చేయాలనుకునే అభ్యర్థులు తమకు కేటాయించిన సంస్థను భౌతికంగా సందర్శించే అవసరం లేకుండానే ఇప్పుడు ఎంసీసీ కౌన్సెలింగ్ పోర్టల్ ద్వారా తమ రాజీనామాను సమర్పించవచ్చు.

పారదర్శకతను, కార్యాచరణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం కోసం... ముందుగా పూరించి ఉన్న అభ్యర్థి డేటాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నుంచి స్వీకరించడం, ఆన్‌లైన్ ద్వారా ధ్రువపత్రాల పరిశీలన, నేషనల్ మెడికల్ కమిషన్ ద్వారా సీట్ మ్యాట్రిక్స్ ధ్రువీకరణ, పాల్గొనే సంస్థల ద్వారా ధ్రువీకరణ వంటి అనేక చర్యలనూ ఈ సమీక్షలో ప్రధానంగా ప్రస్తావించారు.

ప్రామాణిక వైకల్యం కలిగిన దివ్యాంగుల కోసం అనుకూలమైన సౌకర్యాలను కల్పించడంపైనా ప్రత్యేకంగా దృష్టి సారించారు. మరింత మెరుగ్గా అందుబాటులో ఉండడం, మూల్యాంకనంలో పారదర్శకత, ఏకరూపతను సులభతరం చేయడం కోసం దేశవ్యాప్తంగా నిర్దేశిత మూల్యాంకన కేంద్రాల సంఖ్యను 16 నుంచి 61కి విస్తరించారు.

27 జులై 2026 నాటి జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా, నియమిత వైద్య బోర్డులు జారీ చేసే ధృవపత్రాన్ని ఇకపై "అర్హత ధ్రువపత్రం" అని పిలుస్తారు. క్రియాత్మక మూల్యాంకనం ఆధారంగా ఎంబీబీస్ కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థి అర్హతను నిర్ధారించడమే దీని ఉద్దేశం. ఈ సవరించిన మార్గదర్శకాలు సమాన అవకాశాలు, విద్యా ప్రమాణాలు, వృత్తిపరమైన సామర్థ్యం, రోగి భద్రతను నిర్ధారిస్తూనే... మానసిక వైకల్యం ఉన్న అభ్యర్థుల మూల్యాంకనం కోసం పారదర్శకమైన, ఏకరీతి, సాక్ష్యాధారిత, సామర్థ్య-ఆధారిత విధానాన్ని రూపొందిస్తాయి.

అప్పీలేట్ డిసేబిలిటీ అసెస్‌మెంట్ బోర్డు ఏర్పాటుకూ ఈ కొత్త మార్గదర్శకాలు వీలు కల్పిస్తాయి. దీని ద్వారా అర్హులైన అభ్యర్థులు ఇన్ఫర్మేషన్ బులెటిన్‌లోని నిబంధనలకు అనుగుణంగా ప్రాథమిక డిసేబిలిటీ అసెస్‌మెంట్ బోర్డు మూల్యాంకనంపై అప్పీల్ చేసుకోవచ్చు.

ఎన్నారై కేటగిరీ కింద ప్రవేశ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయడం మరో ముఖ్యమైన సంస్కరణ. ఎన్నారై అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ఇప్పుడు నిర్దేశించిన అర్హతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తిగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ పోర్టల్ ద్వారానే జరుగుతుంది. ఇంతకుముందు ఈమెయిల్ ద్వారా పత్రాలను సమర్పించే పద్ధతికి బదులుగా, అభ్యర్థులు అవసరమైన అన్ని పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. అప్‌లోడ్ చేసిన పత్రాలను దీని కోసం నియమించిన డాక్యుమెంట్ వెరిఫికేషన్ అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలిస్తారు. తద్వారా పారదర్శకమైన, సమర్థమైన, కాలపరిమితితో కూడిన ధ్రువీకరణ ప్రక్రియను నిర్ధారిస్తారు. గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, గార్డియన్స్ అండ్ వార్డ్స్ యాక్ట్-1890 నిబంధనల ప్రకారం స్పాన్సర్ ఆ అభ్యర్థికి నిజమైన చట్టబద్ధత గల సంరక్షకుడని నిరూపిస్తూ... ఎన్నారై కేటగిరీ కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కౌన్సెలింగ్ ప్రక్రియ సమయంలో సాక్ష్యాధారాలు, సంబంధిత చట్టపరమైన పత్రాలను సమర్పించవలసి ఉంటుందని 2026 మే 27న జారీ చేసిన తన పబ్లిక్ నోటీసు ద్వారా ఎంసీసీ ఇప్పటికే తెలియజేసింది.

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సమన్వయంతో సైబర్ సెక్యూరిటీ సన్నద్ధతను సమగ్రంగా సమీక్షించినట్లు అధికారులు శ్రీ నడ్డాకు తెలియజేశారు. దేశవ్యాప్తంగా కౌన్సెలింగ్ ప్రక్రియ ఏకరీతిగా అమలు జరిగేలా చూసేందుకు, డిసేబిలిటీ అసెస్మెంట్ బోర్డులు, కళాశాల నోడల్ అధికారులు, ధ్రువపత్రాల పరిశీలన అధికారుల కోసం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు.

అభ్యర్థులకు మద్దతును బలోపేతం చేయడానికి, 24x7 టోల్-ఫ్రీ కాల్ సెంటర్ (1800-102-7637) ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియ అంతటా అభ్యర్థులకు సహాయపడటానికి వీలుగా ద్విభాషా సమాచార సామగ్రి, తరచుగా అడిగే ప్రశ్నలు, మార్గదర్శక వీడియోలనూ వివిధ వేదికల ద్వారా అందుబాటులో ఉంచుతున్నారు. అభ్యర్థుల సందేహాలను త్వరితగతిన పరిష్కరించడానికి, ఈమెయిల్ ఆధారిత ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్నీ ఏర్పాటు చేశారు.

జాతీయ పరీక్షల ఏజెన్సీ 16 జులై 2026న నీట్ (యూజీ)-2026 పరీక్ష ఫలితాలను ప్రకటించింది. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్‌లోని ఆల్ ఇండియా కోటా సీట్ల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది.

సీటును అంగీకరించడం, అప్‌గ్రేడేషన్, రాజీనామా లేదా వైకల్యాన్ని పరీక్షించడానికి సంబంధించిన ఎంపికలను వినియోగించుకునే ముందు... అభ్యర్థులు సమాచార బుల్లెటిన్, కౌన్సెలింగ్ స్కీమ్, వర్తించే నియమాలనూ జాగ్రత్తగా చదవాలని సూచించడమైనది. వారు ప్రవేశ ప్రక్రియ అంతటా అధికారిక ఎంసీసీ కౌన్సెలింగ్ పోర్టల్‌ను క్రమం తప్పకుండా సందర్శించాలనీ, తెలియజేసిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలనీ సూచించడమైనది.

కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలీల శ్రీవాస్తవ, వైద్య విద్య అదనపు కార్యదర్శి శ్రీమతి వినోద్ కోత్వాల్, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ లవనీష్ జి కృష్ణ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ డైరెక్టర్ జనరల్ శ్రీ ప్రియాంక్ భారతి, ఇతర సీనియర్ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

నిజామాబాద్, జులై 30:నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో జల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ రాచకొండ విష్ణువర్ధని శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ ఎం. కిరణ్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు గ్రామ పాలకవర్గం, గ్రామ ప్రజలతో కలిసి జలసిరి కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం. కిరణ్ కుమార్, సర్పంచ్ విష్ణువర్ధని మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సోక్‌పిట్స్ లేదా మ్యాజిక్ సోక్‌పిట్స్ నిర్మించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. రైతులు తమ వ్యవసాయ పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

గ్రామాల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఊట గుంటలు, కమ్యూనిటీ ఊట గుంటలు నిర్మించాలని, భూగర్భ జలాల పెంపుదలకు బోరుబావుల వద్ద రీఛార్జ్ స్ట్రక్చర్లు ఏర్పాటు చేయడం అవసరమని వివరించారు. ఈ చర్యల ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని, భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించవచ్చని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

అలాగే ప్రతి ఇంటిలో నాలుగు రకాల చెత్త డబ్బాలను ఏర్పాటు చేసి, చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐ మల్లేష్, గ్రామ కార్యదర్శి సీహెచ్ రాహుల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాగుల గంగామోహన్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఐకేపీ వీవోలు, కారోబార్ నర్సయ్య, శేఖర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం మహిళల రాస్తారోకో



నల్గొండ, జులై 30: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు గురువారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోత్కూర్?తిరుమలగిరి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక డా. బంగ్లా ప్రాంతంలో నెల రోజులుగా త్రాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నిత్యం కూలీ, వ్యవసాయ పనులకు వెళ్లే తమకు నీటి సమస్యతో ఉపాధికీ ఆటంకం కలుగుతోందని మహిళలు వాపోయారు. మహిళలు బిందెలతో రోడ్డుపై ధర్నా నిర్వహించడంతో కొంతసేపు వాహనాలు, బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నప్పటికీ అది సరిపోవడం లేదని తెలిపారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖలు ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టివేస్తూ సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి క్రమబద్ధంగా త్రాగునీరు అందించాలని మహిళలు డిమాండ్ చేశారు.

మరోవైపు మున్సిపల్ పరిధిలోని జామచెట్ల బావి ప్రాంతంలో కూడా గత నాలుగు, ఐదు రోజులుగా త్రాగునీటి కొరత తీవ్రంగా ఉందని స్థానికులు తెలిపారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్ల ద్వారా నీరు అందడం లేదని పేర్కొన్నారు. రామారం నుంచి వచ్చే మిషన్ భగీరథ పైప్‌లైన్ ఓ వ్యవసాయ పొలంలో పగిలిపోవడంతో మరమ్మతులు ఆలస్యమవుతున్నాయని, దీంతో ట్యాంక్ ద్వారా గానీ, మిషన్ భగీరథ ద్వారా గానీ నీటి సరఫరా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు అవసరాలకు సరిపోవడం లేదని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేసి త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



నిజామాబాద్, జులై 30: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం మెండోరా గ్రామంలో గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి ముత్తేన్న ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు లబ్ధిదారికి అందజేశారు.

ఈ సందర్భంగా దాసరి ముత్తేన్న మాట్లాడుతూ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులు అందించడం జరుగుతోందన్నారు.

లబ్ధిదారి మాట్లాడుతూ, సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరుకు సహకరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డితో పాటు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్, నాయకులు నూకల నర్సయ్య, రామచందర్ గౌడ్, ప్రతీప్, దీపక్, లింబాద్రి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 4న హైదరాబాద్‌లో చేనేత సహకార సంఘాల సదస్సు

నల్గొండ, జులై 30:ఆగస్టు 4న హైదరాబాద్‌లోని ఆటోనగర్ కర్నాటి గార్డెన్స్‌లో తెలంగాణ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులతో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం చిట్యాలలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాలకవర్గాలను ఘనంగా సన్మానించి సొసైటీలకు జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు. గత 13 సంవత్సరాలుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదని, తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో ఎన్నికలు నిర్వహించారని పేర్కొన్నారు. సొసైటీలపై ఉన్న పాత అప్పులను ఇప్పటివరకు పూర్తిగా మాఫీ చేయలేదని విమర్శించారు.

రాష్ట్రవ్యాప్తంగా చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు రూ.30 కోట్లకు మించవని పేర్కొంటూ, రైతులు, ఇతర వర్గాల మాదిరిగానే చేనేత సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను కూడా ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ అధికారి వెంకటేశం హాజరై సహకార సంఘాల చట్టాలు, నిర్వహణపై సభ్యులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. చేనేత సహకార సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

త్రిఫ్ట్ ఫండ్ నిధులను వెంటనే బ్యాంకుల ద్వారా విడుదల చేయాలని, టెస్కో ద్వారా బెడ్‌షీట్లు, టవల్స్ తదితర చేనేత వస్త్రాల టెండర్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా నేరుగా చేనేత సహకార సంఘాలకే ఇవ్వాలని కోరారు. హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ సంస్థలకు అవసరమైన చేనేత వస్త్రాల ఆర్డర్లను కూడా చేనేత సొసైటీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణమాఫీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే చేనేత సహకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకోవడంతో పాటు ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘాలకు ప్రత్యేక గ్రాంటు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందగట్ల గణేష్, చిట్యాల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గంజి సుధాకర్, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మిర్యాల వెంకటేశ్వర్లు, కోశాధికారి కోట రాంబాబు, డైరెక్టర్లు వడ్డేపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో ఓటర్ల వివరాల నమోదు 99.59 శాతం పూర్తి

మహబూబ్‌నగర్, జులై 30: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎన్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని 116వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు.

116వ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)తో మాట్లాడిన కలెక్టర్, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ఎంత మేర పూర్తయిందో అడిగి తెలుసుకున్నారు. ఈ పోలింగ్ కేంద్ర పరిధిలో మొత్తం 1,276 మంది ఓటర్లు ఉండగా, వారిలో 99.25 శాతం మంది వివరాలను ఇప్పటికే డిజిటలైజేషన్ చేసినట్లు బీఎల్ఓ తెలిపారు. మిగిలిన కొద్దిమంది ఓటర్ల వివరాలను కూడా మరో రెండు రోజుల్లో పూర్తిచేస్తామని ఆమె కలెక్టర్‌కు వివరించారు.

అనంతరం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం మొత్తం డిజిటలైజేషన్ పురోగతిపై ఆర్డీఓ అర్చనతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని 270 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,40,571 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,39,563 మంది వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. దీంతో మొత్తం ప్రక్రియలో 99.59 శాతం నమోదు పూర్తైనట్లు ఆర్డీఓ వివరించారు.

ఇంకా మిగిలి ఉన్న 1,008 మంది ఓటర్ల వివరాలను ప్రత్యేక క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ధ్రువీకరించి, అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. తాడూరు, నాగర్‌కర్నూల్ రూరల్ మండలాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇప్పటికే వంద శాతం పూర్తయిందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ప్రతి అర్హ ఓటరు వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు కావాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, ఆర్డీఓ అర్చన, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, డీటీ కిరణ్ కుమార్, బూత్ లెవల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయి ప్రత్యక్ష కార్యక్రమ నిర్వహణ రంగంలో 2030 నాటికి అగ్రస్థానం లక్ష్యంగా సిద్ధమవుతున్న భారత్

న్యూఢిల్లీ, జులై 30:దేశ ఆర్థిక వృద్ధికితోపాటు ఉపాధి కల్పన, పర్యాటక, సాంస్కృతిక రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రత్యక్ష కార్యక్రమ నిర్వహణ (లైవ్ ఈవెంట్స్) రంగం ప్రధాన చోదకం కాగలదని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.

ఈ రంగంలో సుస్థిర ప్రగతి దిశగా 2030 నాటికి భారత్‌ను లైవ్ ఈవెంట్స్ రంగంలో ప్రపంచ అగ్రగామి కూడలిగా తీర్చిదిద్దడం లక్ష్యంగా 2025 జూలైలో 'లైవ్ ఈవెంట్స్ డెవలప్‌మెంట్ సెల్' (ఎల్ఈడీసీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన పనిచేసే ఈ కమిటీలో కేంద్ర మంత్రిత్వ శాఖలు-విభాగాలు సహా రాష్ట్ర ప్రభుత్వాలు, పారిశ్రామిక సంఘాలు, ఇతర భాగస్వామ్య వర్గాల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు.

ఈ కమిటీ ఏర్పాటైన తర్వాత 2025 ఆగస్టు 26, అక్టోబరు 16 తేదీల్లో, 2026 ఫిబ్రవరి 4, ఏప్రిల్ 30 తేదీల్లో నాలుగు దఫాలుగా ఎల్ఈడీసీ సమావేశమైంది. మౌలిక సదుపాయాల బలోపేతం, నిబంధనల సరళీకరణ, వాణిజ్య సౌలభ్య కల్పన సహా లైవ్ ఈవెంట్స్ రంగం కోసం బలమైన ప్రత్యేక వ్యవస్థ సృష్టి దిశగా కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ రంగం సమగ్రాభివృద్ధిపై రూపొందించిన వ్యూహాత్మక ప్రణాళికను 'ఎగ్జిక్యూషన్ ఫ్రేమ్‌వర్క్' పేరిట భాగస్వామ్య వర్గాలన్నింటికీ నివేదిక రూపంలో పంపిణీ. ప్రత్యక్ష కార్యక్రమాల నిర్వహణ అనుమతి కోసం 'ఇండియా సినీ హబ్' (ఐసీహెచ్) పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు. తద్వారా దరఖాస్తు, సమన్వయం, అనుమతులు, చెల్లింపులు, తనిఖీ తదితరాలన్నీ ఒకే వేదికపైకి రావడం సహా నిర్దిష్ట వ్యవధిలో పరిశీలన, ప్రత్యక్ష పర్యవేక్షణ, జాప్యాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధానం, డిజిటల్ చెల్లింపులు-ఆడిట్ సదుపాయాలు లభ్యం.

ఐసీహెచ్ పోర్టల్ ద్వారా అనుమతుల జారీ కోసం 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో నోడల్ అధికారుల నియామకం. దేశంలో లైవ్ ఈవెంట్స్ లైసెన్సింగ్, అనుమతుల సరళీకరణ కోసం ఎల్ఈడీసీ ద్వారా "మోడల్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్- 2026" ముసాయిదా రూపకల్పన, 2026 మార్చి 13న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపిణీ. ప్రస్తుతం 3 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు.

రక్షిత చారిత్రక ప్రాంగణాలు, స్మారక కట్టడాల వద్ద లైవ్ ఈవెంట్స్ నిర్వహణ కోసం ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ద్వారా ప్రామాణిక విధివిధానాల రూపకల్పన సహా 224 వారసత్వ వేదికల జాబితా పంపిణీ. సరికొత్త వేదికల అభివృద్ధి విధానంపై భావనాత్మక ప్రకటన రూపకల్పన సహా రాష్ట్ర ప్రభుత్వాలు, క్రీడా ప్రాధికార సంస్థలు, పారిశ్రామిక భాగస్వాములకు పంపిణీ.

నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసీ), మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్కిల్స్ కౌన్సిల్ (ఎంఈఎస్‌సీ), ఈవెంట్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఈఈఎంఏ)ల భాగస్వామ్యంతో లైవ్ ఈవెంట్స్ రంగంలో సర్టిఫికెట్, స్వల్పకాలిక కోర్సులకు రూపకల్పన సహా ప్రస్తుత పాఠ్యాంశాల్లో ఐచ్ఛికాంశాలుగా చేర్చేందుకు సన్నాహాలు.

ఎల్ఈడీసీ ద్వారా విదేశీ కళాకారులు, సాంకేతిక నిపుణుల వీసా, ఎఫ్ఆర్ఆర్ఓ నిబంధనల సడలింపు, క్రీడా-వారసత్వ వేదికల వినియోగం, మ్యూజిక్ లైసెన్సింగ్ సరళీకరణ, రాత్రి 10 గంటల తర్వాత కార్యక్రమాల నిర్వహణ అనుమతి, వన్నులు-ఆర్థిక వనరుల సమీకరణ తదితరాల గుర్తింపు, సంబంధిత మంత్రిత్వ శాఖల పరిశీలనకు సమర్పణ.

ఎల్ఈడీసీ విజ్ఞాపన మేరకు విదేశీ మారకం నిర్వహణ నిబంధనలు-2026 కింద 5 లక్షల అమెరికన్ డాలర్లు లేదా అంతకన్నా ఎక్కువ విలువైన సేవల దిగుమతికి ముందస్తు చెల్లింపు సమయంలో బ్యాంకు గ్యారంటీ సమర్పణ నిబంధన నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మినహాయింపు లభించింది.

# 'పబ్లిక్ పరీక్షల (అక్రమ విధానాల నిరోధం) సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, జులై 30:దేశవ్యాప్తంగా వివిధ పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ రోజు లోక్‌సభకు సమర్పించిన "పబ్లిక్ పరీక్షల (అక్రమ విధానాల నిరోధం) సవరణ బిల్లు-2026" విస్తృత చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఈ సందర్భంగా కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర, (స్వతంత్ర బాధ్యత) ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది-ప్రజా సమస్యలు-పింఛన్లు, అణుశక్తి, అంతరిక్ష మంత్రిత్వ శాఖల సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. ఈ సవరణలతో పబ్లిక్ పరీక్షలలో అక్రమాల నివారణ సహా విద్యార్థులు, యువత ప్రయోజనాల పరిరక్షణ దిశగా చట్టబద్ధ వ్యవస్థ మరింత బలోపేతం కాగలదని ఆయన వ్యాఖ్యానించారు.

పబ్లిక్ పరీక్షల వ్యవస్థ సమగ్రత, పారదర్శకత, విశ్వసనీయతలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వ్యవస్థీకృత పరీక్షల సంబంధిత నేరాలను సమర్థంగా నిరోధించడంలో భాగంగా ఆచణాత్మక సూచనల స్వీకారం, అనుభవాల నుంచి గుణపాఠాలు సహా చట్టాన్ని మరింత పటిష్టం చేయడంపై ప్రభుత్వ సంసిద్ధతను ఈ సవరణలు ప్రతిబింబిస్తాయని చెప్పారు.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ), రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) సహా ఉన్నత విద్య ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వంటి ప్రధాన నియామక సంస్థలు నిర్వహించే ప్రభుత్వ పరీక్షలలో అవకతవకల నిరోధానికి సమగ్ర చట్టబద్ధ చట్రం రూపకల్పన లక్ష్యంగానే "పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్-2024"ను రూపొందించినట్లు మంత్రి గుర్తుచేశారు. ఈ చట్టం పరిధిలోని నేరాలను ఇప్పటికే కఠిన శిక్షా నిబంధనలతో విచారణార్హమైనవిగా, బెయిలుతోపాటు రాజీపడటానికి వీలులేనివిగా ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో ప్రస్తుత సవరణ బిల్లులోని కీలక నిబంధనలను వివరిస్తూ- అవకతవకలకు పాల్పడేవారికి విధించే శిక్షను 3 నుంచి 5 ఏళ్లు .. 5 నుంచి పదేళ్లకు పెంచినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. అలాగే, గరిష్ఠ జరిమానాను 10 లక్షల నుంచి 50 లక్షలకు పెంచామన్నారు. ఇలాంటి నేరాలలో పాలుపంచుకునే సేవా సంస్థలకు గరిష్ఠ జరిమానాను 1 కోటి నుంచి ?5 కోట్లకు పెంచడంతోపాటు ప్రభుత్వ పరీక్షల నిర్వహణలో వాటిపై నిషేధ కాలాన్ని 4 నుంచి 8 ఏళ్లకు పెంచారు. సేవా సంస్థల డైరెక్టర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ బాధ్యులకు విధించే శిక్షను కూడా 3 నుంచి 10 సంవత్సరాలు, 5 నుంచి 10 సంవత్సరాలకు జైలుశిక్షను పెంచారు. గరిష్ఠ జరిమానా ?1 కోటి నుంచి ?5 కోట్లకు పెంపు సహా వ్యవస్థీకృత నేరాలపై శిక్షను 5 నుంచి 10 సంవత్సరాలకు, 7 నుంచి 10 ఏళ్లకు పెంచారు. అలాగే, గరిష్ఠ జరిమానాను ?1 కోటి నుండి ?10 కోట్లకు పెంచారు.

ప్రభుత్వ పరీక్షల సంబంధిత నేరాలపై ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ఈ సవరణ బిల్లు వీలు కల్పిస్తుందని మంత్రి తెలిపారు. అభియోగపత్రం దాఖలు చేసిన తేదీ నుంచి రెండు నెలల్లోగా దర్యాప్తు, మూడు నెలల్లోగా విచారణ పూర్తి కావాల్సి ఉంటుందని చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకానికి కూడా ఈ బిల్లు వీలు కల్పిస్తుందని, దీనికింద నేర దర్యాప్తు నిమిత్తం ప్రత్యేక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని వివరించారు. తద్వారా వ్యవస్థీకృత పరీక్షల సంబంధిత నేరాలపై దర్యాప్తు, చర్యలలో వేగం పెరుగుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పరీక్షల వ్యవస్థను "లీక్-ప్రూఫ్"గా మార్చేందుకు ప్రసిద్ధ నిపుణులతో ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించడాన్ని ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. పరీక్షల వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా అందిన సిఫారసుల అమలులో గణనీయ ప్రగతి సాధించామని చెప్పారు.

ఇక 2024 నాటి చట్టం అమలును ప్రస్తావిస్తూ- దానికింద ఇప్పటికే 52 కేసులు నమోదైనట్లు గుర్తుచేశారు. పరీక్షల సంబంధిత నేరాలపై తక్షణ, కఠిన చర్యలకు ప్రభుత్వ కట్టుబాటుకు ఇది నిదర్శనమని మంత్రి అన్నారు. నిజాయితీపరులు, అర్హులైన విద్యార్థుల కృషికి తగిన ప్రతిఫలం లభించేలా చూడటం ప్రధానమన్నారు. అంతేకాకుండా కఠిన, చట్టపరమైన నిబంధనలు సహా సత్వర న్యాయం ప్రదానంతో పరీక్షల సంబంధిత వ్యవస్థీకృత నేరాలను అరికట్టడమే ఈ సవరణల లక్ష్యమని ఆయన ప్రకటించారు. చివరగా- ఈ సవరణ బిల్లుకు ఆమోదం లభించడం ద్వారా లక్షలాది విద్యార్థులు-ఉద్యోగార్థుల ఆకాంక్షల పరిరక్షణ సాధ్యమవుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దేశంలో ప్రభుత్వ పరీక్షల వ్యవస్థ నిష్పాక్షికత, పారదర్శకత, విశ్వసనీయతపై ప్రజల విశ్వాసం బలోపేతం చేసే దిశగా ఇదొక కీలక మలుపని పేర్కొంటూ ప్రసంగం ముగించారు.

## గోదావరి నది పరివాహక ప్రాంత మనుషులు నది లోకి వెళ్లడం గాని, పశువులును దాటించడం గాని చెయ్యవద్దు

ములుగు, జులై 30:(నేటినిజం ప్రతినిధి)అల్పపీడనం కారణముగా గోదావరి నది పరివాహక ప్రాంతంలో పడ్డ భారీ వర్షాలు నేపథ్యంలో సమ్మక్క సాగర్ బ్యారేజ్ వద్ద గోదావరి నది నీటి ప్రవాహం ఈ రోజు ఉదయం గం 9.00ని లకు 95600 C/S నుండి రాత్రి గం 9.00ని లకు 185600 C/S కు పెరగడం జరిగిందనిజిల్లా నీటిపారుదల అధికారి, అప్పల నాయుడు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

తదుపరి నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నది లో చేపలు పట్టేవారు గాని, పరివాహక ప్రాంతంలోని మనుషులు నది లోకి వెళ్లడం గాని, పశువులును దాటించడం గాని చెయ్యవద్దు అని గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలకు తెలియచేయవలసినదిగా సంబంధిత మండల అధికారులకు కోరడమైనది.

## జాతీయ రహదారులపై ఆక్రమణల తొలగింపు అమల్లోకి సుప్రీంకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ, జులై 30:దేశ రవాణాకు, ఆర్థిక వృద్ధికి భారత దేశ జాతీయ రహదారులు వెన్నెముకగా నిలుస్తున్నాయి. ఇవి ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులనూ, సరకునూ రాష్ట్రాల మధ్య రవాణా చేస్తున్నాయి. అయితే, రహదారి భద్రతకూ, జాతీయ రహదారి సమర్థ నిర్వహణకూ రహదారులపై ఆక్రమణలు పెను సమస్యగా పరిణమించాయి.

అక్రమ నిర్మాణాలు, వాణిజ్య సంస్థలు, తాత్కాలిక షెడ్లు, రహదారి పక్కన ఆక్రమణలు, తదితరమైనవి రహదారులను ఇరుకుగా మారుస్తాయి. దీనివల్ల ముందున్న మార్గం సరిగ్గా కనిపించకపోవడంతో పాటు, నీటి పారుదల వ్యవస్థ దెబ్బతింటుంది. అలాగే సురక్షితం కాని ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలు ఏర్పడతాయి. ఇలాంటి ఆక్రమణల వల్ల అకస్మాత్తుగా లేన్ మారాల్సి రావడం, ప్రతిస్పందన సమయం తగ్గిపోవడం, డ్రైవర్ల దృష్టి మరలిపోవడం వల్ల వాహన ప్రమాదాలు సంభవించే అవకాశం గణనీయంగా పెరుగుతుంది. ఈ ఆక్రమణల వల్ల జాతీయ రహదారి నిర్వహణ, అత్యవసర స్పందన, భవిష్యత్తులో మౌలిక వసతుల విస్తరణకు ఆటంకం ఎదురవుతుంది.

రోడ్లను సురక్షితంగా, అందరికీ అందుబాటులో ఉంచాల్సిన అవసరాన్ని గుర్తించిన సుప్రీం కోర్టు... రోడ్లు, జాతీయ రహదారులపై ఆక్రమణలు తొలగించాల్సిందిగా ఆదేశించింది.

దీనికి అనుగుణంగా దేశవ్యాప్తంగా నిరంతర ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలను రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (ఎంవోఆర్టీహెచ్), భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత విధానాలకు అనుగుణంగా చేపడుతున్నాయి. రైట్ ఆఫ్ వే (ఆర్‌వోడబ్ల్యూ)ను పునరుద్ధరించడం, వాహనాల గమనాన్ని మెరుగుపరచడం, రోడ్డు వినియోగదారులందరికీ భద్రతను పెంపొందించడమే వీటి లక్ష్యం.

ఇలాంటి ఒక కార్యక్రమాన్ని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), రాజ్‌కోట్ పీఐయూ చేపట్టాయి. ఇది సుమోటో రిట్ పిటిషన్ (సివిల్) నెం.9 ఆఫ్ 2025లో భారత సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ.. ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించింది.

తన పరిధిలో ఉన్న 693 కి.మీ.ల జాతీయ రహదారులను ఎన్‌హెచ్ఏఐ సర్వే చేసింది. అక్రమ నిర్మాణాలు, అనధికార వాణిజ్య ప్రవేశ మార్గాలు, అనుమతులు లేని మీడియన్ కట్‌లకు సంబంధించి 1,403 నోటీసులను జారీ చేసింది. ఇవన్నీ హైస్పీడు కారిడార్లలో ప్రమాదాల ముప్పును పెంచే భద్రతాపరమైన సమస్యలు. తక్షణ స్పందనలో భాగంగా.. ఇప్పటికే 361కి పైగా అక్రమ ప్రవేశాలను, ఆక్రమణలను తొలగించడంతో పాటు 150 అనధికార మీడియన్ ఖాళీలను శాశ్వతంగా మూసివేసింది. ఆయా జిల్లాల కలెక్టర్లు (డీఎంలు), పోలీసు సూరింటెండెంట్లు (ఎస్పీలు) సమన్వయంతో ఈ ఆక్రమణలను తొలగిస్తున్నారు. తాజాగా పెద్ద ఎత్తున చేపట్టిన తొలగింపుల ద్వారా ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన సోమనాథ్ ?ద్వారక హైవేపై ముఖ్యంగా బర్థియా, ఆనెస్ట్ హోటల్ నుంచి హాథీ చౌక్ వరకు రహదారిపై ఉన్న వందలాది ఆక్రమణలను తొలగించారు.

# పవన్ కళ్యాణ్‌తో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల భేటీ

-సూపర్ ఎల్ నినోపై రైతులకు అవగాహన కల్పించాలి
-రైతులతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించాలి
-సాగునీటి సంక్షోభానికి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని సూచన



అమరావతి, జులై 30:రాష్ట్రంలో నెలకొన్న సూపర్ ఎల్ నినో ప్రభావం, సాగునీటి సంక్షోభంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుసూచించారు. రైతులతో ప్రత్యక్షంగా సమావేశాలు నిర్వహించి ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, నీటి వినియోగంలో జాగ్రత్తలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు వివరించాలని అన్నారు.

గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉప ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన నీటి కొరత, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై సమీక్షించారు.

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. కాకినాడ జిల్లా పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట తదితర ప్రాంతాల రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రతి రైతు పంట బీమా చేయించుకునేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే నీటి వృథాను అరికట్టేందుకు కాలువల పూడిక తొలగింపు, గట్ల మరమ్మతులు, లీకేజీల నివారణ వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదని పేర్కొన్న ఆయన, ముఖ్యంగా కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు.అంతకుముందు, భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## సుద్దులంలో విద్యుత్ షాక్ తో రెండు ఆవులు మృతి



కామారెడ్డి, జులై 30:(నేటినిజం ప్రతినిధి) మేత కోసం వెళ్లిన ఆవులు విద్యుత్ షాక్ తో మృతి చెందాయి. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సుద్దులం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కోటగిరి మండలం సుద్దులం గ్రామానికి చెందిన గోపు బంగారి సాయిలు అనే వ్యక్తి తన రెండు ఆవులు మేత కోసం గ్రామ శివారులో తీసుకెళ్తున్నాడు.

కాగా గ్రామ సమీపంలో రోడ్డుకు పక్కనే అనుకొని ఉన్న సింగిల్ ఫేస్ డిటీఆర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి సుమారు రూ.2లక్షలు విలువ చేసే పాడి ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ విషయం తెలిసిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. రెండు ఆవులు సుమారుగా రూ.2లక్షలు ఉంటుందని, పరిహారం ఇచ్చి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# సాగునీటిపై ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### కృష్ణా, గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించకపోతే పాలమూరు ఎడారిగా మారే ప్రమాదమని హెచ్చరిక




హైదరాబాద్, జులై 30:రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, కృష్ణా-గోదావరి నదుల్లో పెరుగుతున్న వరద ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వి. శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పాలమూరు జిల్లాకు కృష్ణా, తుంగభద్ర, భీమా నదులే ప్రధాన ఆధారమని, ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నప్పటికీ రిజర్వాయర్లను నింపే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారని, అందుబాటులో ఉన్న అన్ని లిఫ్ట్ పంపులను వెంటనే ప్రారంభించి నీటిని రిజర్వాయర్లలో నిల్వ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం తాగునీటి అవసరాలకే నీటిని పరిమితం చేయడం సరైన విధానం కాదని, సాగునీటి అవసరాలను కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేస్తే దానిని వినియోగించుకునే అవకాశం ఉందని, కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించకుండా ప్రభుత్వం రాజకీయ కారణాలతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును భవిష్యత్ కరువులను దృష్టిలో పెట్టుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూపొందించారని, ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తున్న లిఫ్ట్ వ్యవస్థలు కూడా ఆ ప్రాజెక్టులో భాగమేనని పేర్కొన్నారు.

గోదావరి, కృష్ణా నదులపై ఉన్న అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పూర్తిస్థాయిలో నడపాలని కోరిన శ్రీనివాస్‌గౌడ్, కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు వేగంగా చర్యలు తీసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆల్మట్టి ఎత్తు పెరిగితే తెలంగాణకు కృష్ణా జలాల లభ్యత తగ్గి పాలమూరు, నల్గొండ జిల్లాలపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే కర్ణాటక ముఖ్యమంత్రితో చర్చలు జరిపి ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు రావడం స్వాగతించదగ్గ పరిణామమేనని, అయితే ఆ ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేసి కాలువల పనులకు వెంటనే టెండర్లు పిలవాలని కోరారు.అదే సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, పాలమూరు రైతులకు సాగునీరు అందకుండా ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. అన్ని పంపులను వెంటనే ప్రారంభించి రామన్నపాడు సహా అన్ని రిజర్వాయర్లను నింపాలని, లేకపోతే రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## 24 గంటలూ జనంలోనే ఉంటా..

### -టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, జులై 30: (నేటినిజం ప్రతినిధి):కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు, ప్రభుత్వ వ్యవహారాలపై గత మూడున్నరేళ్లుగా తాను ఎలాంటి బహిరంగ వ్యాఖ్యలు చేయలేదని, అందుకు కారణం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఇచ్చిన మాటేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడించారు. సంగారెడ్డిలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. జూలైలో కీలక ప్రకటన చేస్తానని అంతకుముందు చెప్పిన ఆయన, మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యేలా వ్యాఖ్యలు చేశారు. తాను ఏ విషయమైనా మాట్లాడాల్సి వస్తే ముందుగా ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీతో చర్చించిన తర్వాతే బయట మాట్లాడతానని స్పష్టం చేశారు. మనసులో ఒకటి పెట్టుకుని బయట మరొకటి మాట్లాడే వ్యక్తిని తాను కాదని పేర్కొన్నారు.

మూడున్నరేళ్ల క్రితం పార్టీలో లోపాలు ఉన్నప్పుడు వాటిని బహిరంగంగానూ, అంతర్గతంగానూ చర్చించానని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం పీఏసీ సమావేశాల్లో చర్చించిన విషయాలు కూడా బయటకు వస్తుండటంతో ఆ సమావేశాలకు వెళ్లడం మానేశానని తెలిపారు.

తాను సమావేశానికి హాజరై ఉంటే పార్టీ లో జరుగుతున్న పరిణామాలను ఏఐసీసీ ఇన్‌చార్జి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేవాడినని, కానీ తాను మాట్లాడిన అంశాలు కూడా బయటకు వచ్చే అవకాశం ఉండటంతో దూరంగా ఉన్నానని చెప్పారు.



ములుగు జిల్లా నేటి నిజం ప్రతినిధి ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లి గ్రామం వెళ్లే దారిలో టోర్నడో అనే రాకస గాలి బిబాత్సనికి వందల చెట్లు నెల మట్టం కాగా వాటిని ములుగు జిల్లా ఎతీబ పార్టీ అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ బాబు మరియు పార్టీ ముఖ్య నాయకులు కలిసి పరిశీలించడం జరిగింది

# వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### -కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జులై 30:(నేటనిజం ప్రతినిధి)భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. రెండ్రోజులుగా వర్షాలు ండాలన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నా రు. ప్రతి ఒక్కరూ అధికార యంత్రాంగం జారీ చేసే అప్రమత్తంగా ఉండాలని సూచించా రు. భారీ వర్షాల నేపథ్యంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.



కురుస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. రోబోయే రోజుల్లో భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

వర్షాల సమయం లో ఎట్టి పరిస్థితుల్లోనూ నదులు, వాగులు, చెరువులు, కాలువలు, ఇతర నీటి ప్రవాహ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని సూచించారు. జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయి లో అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్ నం.84682 20069తో పాటు డయల్ 100, అగ్నిమాపక శాఖ 101కు కాల్ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు విక్టర్, వీఎన్ గిరి, ట్రైనీ కలెక్టర్ రవితేజ, అధికారులు పాల్గొన్నారు.

## 'సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు'

### -చుంచుపల్లి ఎంపీడీవో సుభాషిణి

ఖమ్మం, జులై 30: చుంచుపల్లి మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై జడ్పీ సీఈఓ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారుల నుండి వివరణ కోరుతూ జిల్లా శాఖల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ సుభాషిణి తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి 19 శాఖల ను ఆహ్వానించగా 11 శాఖలకు సంబంధించిన అధికా రులు మాత్రమే హాజరయ్యారు. మిగతా ఎనిమి ది శాఖల మండల అధికారులు హాజరు కాలేదని ఆమె తెలిపారు. విద్యుత్, వ్యవసాయ, అటవీ, ఎక్సైజ్, మత్స్య, పోలీస్, విద్యాశాఖ, ఇరిగేషన్ కీలక శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజా ప్రతినిధులకు సమాధానాలు లభించకపో వడంతో సమావేశంలో ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

# అసమానాలు అటవీ రేంజర్ల త్యాగాలు

## జూలై 31...ప్రపంచ రేంజర్ దినోత్సవం

ప్రకృతిని పరిరక్షించేవారు ఆయుధాలతో కాదు... అడవిలో అడుగులు వేసే నిరాహంకార పాదాలతో, వన్య జీవులను కాపాడే మానవతా హృదయాలతో. అలాంటి అటవీ సంరక్షకులు ? రేంజర్లు ? వారి సేవలకు స్మరణార్థంగా ప్రతి సంవత్సరం జూలై 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ రేంజర్ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం వన రక్షకుల త్యాగాలకు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లకు గుర్తింపుగా, భద్రతా హక్కులపై చర్చకు వేదికగా నిలుస్తోంది.

1992లో ఏర్పడిన ఇంటర్నేషనల్ రేంజర్ ఫెడరేషన్ (ఎఫ్ఈఈ) ఆధ్వర్యంలో 2007 నుంచి ఈ దినోత్సవం నిర్వహించ బడుతోంది. ఇదే తేదీన 1992లో విధిలో ప్రాణాలు కోల్పోయిన యుగాండా రేంజర్‌కు స్మారకంగా జూలై 31ను ఎంచుకున్నారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా 100కి పైగా దేశాల్లో ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

రేంజర్ పదవిని మామూలుగా అటవీ భద్రతా ఉద్యోగిగా భావించినా... వాస్తవానికి వీరు పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్య సంరక్షణకు ముందు వరుసలో నిలిచే యోధులు. వారివల్లే మన అడవులు, వన్య ప్రాణులు, ప్రకృతి వనరులు కాపాడ బడతాయి. వీరు వేటగాళ్లు, అక్రమ కలప స్మగ్లర్లు, అడవిని ఆక్రమించే వారితో రోజూ పోరాడాల్సి వస్తోంది. దట్టమైన అడవులు, కఠిన వాతావరణ పరిస్థితులు, హింసాత్మక ఘటనలు వీరి పని భాగమై పోయాయి. కానీ వీరికి సరైన మౌలిక వసతులు, రక్షణా పరికరాలు, శిక్షణలు చాలా చోట్ల లేవు. ఇలాంటి పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారు.

గత 15 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 1,700 మందికి పైగా వన రక్షకులు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఒక్క ఏడాది లోనే 137 మంది రేంజర్లు మరణించారు, వీరిలో 46 మంది హత్యలు, 22 మంది వాతావరణ ప్రమాదాలు, 19 మంది వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు విడిచారు. ప్రస్తుతం 105కి పైగా దేశాల్లో 2 లక్షల మంది వన రక్షకులు విధుల్లో ఉన్నారు. వారి ప్రాణాలకు గౌరవంగా పనిచేస్తున్న థిన్ గ్రీన్ లైన్ ఫౌండేషన్ వంటి సంస్థలు వీరి కుటుంబాలకు సహాయ పడుతున్నాయి.

భారత దేశం మొత్తం 7,13,789 చదరపు కిలోమీటర్ల అటవీ భూమిని కలిగి ఉండగా, దాదాపు 2.5 లక్షల మంది అటవీ ఉద్యోగులు ఈ విభాగంలో ఉన్నారు. వీరిలో రేంజర్లు, బీట్




గార్డులు, వన్య జీవ పరిరక్షణ అధికారులు ముఖ్యులు. గడచిన 20 ఏళ్లలో 250 మందికి పైగా భారత రేంజర్లు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, నాగలాండ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వన రక్షకులు మావోయిస్టు దాడులు, అక్రమ వేటగాళ్ల హింసను ఎదుర్కొన్నారు.

2019లో ఛత్తీస్ గఢ్‌లో ఓ రేంజర్ మావోయిస్టుల పేలుడు బాంబులో మరణించాడు. 2021లో మాధవరావ్ నేషనల్ పార్క్‌లో ఒక జింకను రక్షించేందుకు ప్రయత్నిస్తూ ఓ రేంజర్ మరణించాడు. 2023లో ఒడిశాలోని సింహాచలం అడవిలో అక్రమ వేట నుంచి ప్రాణులను రక్షిస్తూ ఒక మహిళా రేంజర్ ప్రాణాలు కోల్పోయింది. 2024లో తెలంగాణలోని కౌన్సర్ ఫారెస్ట్ రిజర్వులో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు వన రక్షకులపై సామూహిక దాడి జరిగింది.

ఈ నేపథ్యంలో రేంజర్లకు ఎదురయ్యే ప్రధాన సవాళ్లు: ఆధునిక టెక్నాలజీ లేమి ? ఉఖూ, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలు లేవు. భద్రతా దుస్తులు, ఆయుధాల లేమి. అల్ప వేతనాలు, రాత్రిపూట పని, మానసిక ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు. విధుల్లో గాయపడినా మెరుగైన వైద్యం లేకపోవడం. మరణించిన తర్వాత కుటుంబాలకు సరైన న్యాయం, పరిహారం ఆలస్యంగా రావడం.

ఈ నేపథ్యంలో కేంద్ర వనశాఖ, విధుల్లో మరణించిన రేంజర్లకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలన్న ప్రతిపాదన చేసింది. రాష్ట్రాల స్థాయిలో కూడా రేంజర్లకు విశ్రాంతి వసతులు, ఆరోగ్య శిబిరాలు, రక్షణా పరికరాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వన రక్షకులను సైనికుల్లా గౌరవించాలి. వన యోధుడు పురస్కారం వంటి అవార్డులు ఇవ్వాలి.

అటవీ సంరక్షణలో సమాజం భాగస్వామ్యంగా మారాలి. పాఠశాల స్థాయిలో నుంచే వన్యజీవ సంరక్షణపై అవగాహన కల్పించాలి. పర్యాటకులు అటవీ నియమాలను గౌరవించాలి. పౌర సమాజం రేంజర్లకు మద్దతుగా నిలవాలి.

ప్రపంచ రేంజర్ దినోత్సవం అంటే కేవలం స్మరణ మాత్రమే కాదు... అది ఒక బాధ్యత. మనకు ఊపిరినిచ్చే అడవులను కాపాడే వారి పోరాటాన్ని గౌరవించాల్సిన బాధ్యత. వారు మాట్లాడే వారు కాదు, ప్రకృతికి స్వరమిచ్చే వారు. అటువంటి వనరక్షకులకు మన హృదయ పూర్వక వందనం.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# బండ్ పార్క్‌ను ప్రారంభించిన మంత్రులు



రాజన్న సిరిసిల్ల, జులై 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువు వద్ద నిర్మించిన నూతన బండ్ పార్క్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్, మేడిపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన బండ్ పార్క్‌ను సందర్శించిన ప్రజాప్రతినిధులు అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులతో పాటు స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన విహార వేదికగా ఈ పార్క్ ఉపయోగపడుతుందని వారు తెలిపారు. గుడి చెరువు పరిసరాల సుందరీకరణతో పాటు వేములవాడను మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో బండ్ పార్క్ కీలక మైలురాయిగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలు ఈ పార్క్‌ను పరిరక్షిస్తూ వినియోగించుకోవాలని వారు కోరారు.

# కళాకారుల బోనాల జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జులై 30:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కళాకారుల ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీన నిర్వహించనున్న కరీంనగర్ కళాకారుల బోనాల జాతర పోస్టర్‌ను గురువారం నగర మేయర్ ×కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఆగస్టు 5న ఉదయం 9 గంటలకు గీతాభవన్, తెలంగాణ చౌక్ నుంచి బోనాల ర్యాలీ ప్రారంభమై కోతిరంపూర్ పోచమ్మ ఆలయం వరకు కొనసాగుతుందని, అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు (ఆట-పాట) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని బోనాల జాతరను విజయవంతం చేయాలని ×మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోగుల ప్రసాద్, బాబు గౌరవేణి, సంతోష్ తమ్మిశెట్టి, అభినవ్ కొత్తకొండ, తిప్పబత్తిని రవి, చిలివేరి శ్రీకాంత్, యతిరాజు, దేవరాయ శ్రీనివాస్, దాసం అజయ్, సంద స్వప్న, గాజుల ప్రీతి తదితరులు పాల్గొన్నారు.




# తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులపై మేయర్, కమిషనర్ ఆకస్మిక తనిఖీ

**-కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి నిర్ణయం**
**- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశాలతో హుటాహుటిన చర్యలు**

కరీంనగర్, జులై 30: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరంలోని తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనుల్లో నెలకొన్న జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గురువారం ఆకస్మికంగా నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల ఆర్వోబీ సమీపంలోని కల్వర్టులో ఓ వృద్ధురాలు పడిపోయిన ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం న్యూఢిల్లీ నుంచి మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి, మున్సిపల్ కార్పొరేషన్ తరఫున అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో మేయర్ వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి తాత్కాలిక పరిష్కారంగా బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఏసీపీ విజయ్ కుమార్ ఆర్వోబీ నిర్మాణ ప్రాంతానికి చేరుకుని బీటీ రోడ్డు, కల్వర్టు పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన మేయర్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు అందుబాటులో లేకపోయినా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించారు. సంబంధిత అధికారులకు వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణంలో ప్రధాన అడ్డంకి భూసేకరణ జాప్యమేనని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ పూర్తికాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తూ త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్వోబీ నిర్మాణ సమయంలో ప్రజల రాకపోకలకు ప్రత్యామ్నాయంగా చేపట్టాల్సిన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ పనులు నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ సేతు బంధన్ పథకం కింద ఆర్వోబీ నిర్మాణానికి అవసరమైన నిధులు పూర్తిగా విడుదల చేసినప్పటికీ పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన నిర్మాణ సంస్థ ప్రతినిధులు భూసేకరణ ప్రక్రియ పూర్తికాగానే పనులు వేగవంతం చేస్తామని, వచ్చే ఆరు నెలల్లో ఒక వైపు ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేసి, ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాదిలోపు మొత్తం ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అలాగే నగరంలోని పలు డివిజన్లలో వర్షాల ప్రభావానికి గురైన ప్రాంతాలను కూడా మేయర్ పరిశీలించి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వాల మధ్య నిధుల అంశం ఎలా ఉన్నప్పటికీ నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ కార్పొరేషన్ తరఫున అవసరమైన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను అత్యవసరంగా చేపడతామని స్పష్టం చేశారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఐఏఎస్, ఏసీపీ విజయ్ కుమార్, సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి, ఆర్‌డబీ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఇండియన్ ఆయిల్ ఎల్పీజీ సిలిండర్ల 'ఎక్స్‌ప్రెస్ డెలివరీ' ప్రారంభం




హైదరాబాద్, జులై 30: వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. బుక్ చేసిన నాలుగు గంటల్లోనే డెలివరీ అయ్యేలా పది కిలోల కాంపోజిట్ 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ', ఐదు కిలోల 'ఛోటూ' సిలిండర్ల 'ఎక్స్‌ప్రెస్ డెలివరీ' సేవలను ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ ఏఎస్ సాహ్నీ పుణేలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ' వినియోగదారులకు మరింత స్మార్ట్, సురక్షితమైన, అనుకూలమైన ఎల్పీజీ అనుభవాన్ని అందిస్తుందన్నారు. వినియోగదారుల సేవల్లో నూతన ప్రమాణాలను నెలకొల్పుతూ భవిష్యత్ అవసరాలకు తగ్గ ఇంధన పరిష్కారాలను అందించడంలో ఇండియన్ ఆయిల్ కట్టుబడి ఉందనడానికి ఇది నిదర్శనమన్నారు.

ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ మార్కెటింగ్ డైరెక్టర్ శ్రీ సౌమిత్ర పీ శ్రీవాస్తవ మాట్లాడుతూ వినియోగదారులు వేగవంతమైన, సౌకర్యవంతమైన సేవలను కోరుకుంటున్నారన్నారు. 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ' వినూత్న సాంకేతికతను, నమ్మకమైన డెలివరీతో ఇండియన్ ఆయిల్ వినియోగదారుల ప్రాధాన్యతను చాటి చెప్తుందన్నారు. గృహ ఎల్పీజీ అనుభవాన్ని పునర్నిర్వచించడంలో ఇది మరొక కీలకమైన అడుగు అన్నారు.

ఈ సేవలను ప్రాథమికంగా పుణే, గుర్గావ్, ఇండోర్, కోయంబత్తూర్ నగరాల్లో అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

ఆగస్టు 2026 మధ్య నాటికి మరో 25 నగరాలకు, అక్టోబర్ 2026 చివరి నాటికి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

వినియోగదారులు ఇండియన్ ఆయిల్ వన్ యాప్, వెబ్‌సైట్ (https://cx.indianoil.in) ద్వారా కొత్త కనెక్షన్ల కోసం నమోదు చేసుకోవచ్చన్నారు.

త్వరలోనే వాట్సాప్ (7588888824) బుకింగ్ సదుపాయం కూడా అందుబాటులోకి రానుందన్నారు.

# సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి

**మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

రాజన్న సిరిసిల్ల, జులై 30:(నేటినిజం ప్రతినిధి):, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ కు చేరుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంత్రులకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి.. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋష్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శాలువాలతో మంత్రులను సత్కరించి ఆహ్వానించారు.

# ఇండియా మొబైల్ కాంగ్రెస్ 10వ ఎడిషన్‌కు థీమ్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య

న్యూ ఢిల్లీ, జులై 30: భారతదేశపు ప్రముఖ డిజిటల్ సాంకేతిక వేదిక అయిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, కేంద్ర కమ్యూనికేషన్లు మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా 2026 ఇండియా మొబైల్ కాంగ్రెస్ అధికారిక థీమ్‌గా సరిహద్దులు లేని విస్తరణను ప్రకటించారు. ఈ కార్యక్రమం 2026 అక్టోబర్ 7 నుంచి 10 వరకు న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా విధాన రూపకర్తలు, పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు విద్యా సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ పదేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ఐ ఎం సి 2026, గత దశాబ్దంలో భారత డిజిటల్ రంగం సాధించిన పురోగతిని ప్రతిబింబించడమే కాకుండా, ప్రపంచ డిజిటల్ పరివర్తనలో తదుపరి దశకు దిశానిర్దేశం చేస్తుంది. భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖకు చెందిన టెలికమ్యూనికేషన్స్ విభాగం సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ 10వ ఎడిషన్‌కు 1.5 లక్షలకు పైగా సందర్శకులు, 100కుపైగా దేశాల నుంచి 300కుపైగా ఎగ్జిబిటర్లు భాగస్వాములు, అలాగే 1,500కుపైగా సాంకేతిక వినియోగ నమూనాలు ప్రదర్శించబడనున్నాయి. ఈ సందర్భంగా



కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా మాట్లాడుతూ,''సాంకేతికత ప్రతి పౌరుడికి చేరుకున్నప్పుడు అవకాశాలు ఏర్పడతాయి. అవకాశాలు ప్రతి పౌరుడికి చేరుకున్నప్పుడు మార్పు అనివార్యమవుతుంది. ప్రస్తుతం 133 కోట్ల మంది చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉన్నాయి. డేటా ధరలు జీబీకి ?287 నుంచి సుమారు ?8కు తగ్గాయి. 6ఉతో భౌతిక ప్రపంచం, డిజిటల్ ప్రపంచం మేధస్సును ఒకే సమగ్ర వ్యవస్థగా అనుసంధానిస్తామని నేను విశ్వసిస్తున్నాను. భారత్ 6ఉ అలయన్స్ ప్రపంచ ప్రమాణాల రూపకల్పనలో భారత్ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతోంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.